ప్రజాశక్తి

ఆదివారం 7 జులై 2024 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

రేపటి నుంచి ఉచిత ఇసుక

- టన్నుకు రూ.192 ధర నిర్ణయం - రవాణా ఛార్జీలు అదనం
- గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని నిల్వలను తీసుకువెళ్లేందుకు నిర్ణయం
- నిర్మాణ రంగానికి తొలగనున్న ఇబ్బందులు



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడుజిల్లాల్లో సోమవారం నుంచి నూతన ఇసుక విధానం అమలుకు అధికారులు చర్యలు చేపట్టారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి ఇప్పటి వరకు స్టాక్ యార్డులలో, రీచ్‌లలో ఉన్న నిల్వలను ప్రజలకు ఇచ్చేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. వినియోగదారులు లోడింగ్, ప్రయాణ ఖర్చులను మాత్రమే భరించాలని గుంటూరు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ తెలిపారు. వినియోగదారులు తమ ఆధార్ ఇతర ధృవీకరణ పత్రాలు చూపి ఇసుక తీసుకువెళ్లవచ్చునని తెలిపారు. జిల్లాలోని గుండిమెడ, మున్నంగి, కొల్లిపర స్టాక్ యార్డు, తాళ్లాయపాలెం, లింగాయపాలెం వద్ద ఇసుక అందుబాటులో ఉంది. ఇసుక రీచ్‌ల వద్ద అక్రమాలు జరగకుండా సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా మొత్తం మీద దాదాపు రెండు లక్షల టన్నుల నిల్వ ఉన్నట్టు తెలుస్తోంది. అలాగే పల్నాడు జిల్లా వైకుంఠపురం, క్రోసూరు, కొత్తపల్లి, మాదిపాడు, వినుకొండ, కొండమోడులో స్టాక్ యార్డుల్లో 2.39 లక్షల టన్నుల ఇసుక నిల్వ ఉందని పల్నాడు కలెక్టర్ శ్రీకేష్ లత్కర్ తెలిపారు. పల్నాడు జిల్లాలో ఇసుక అమ్మకం ధరలను ఇలా నిర్ణయించారు. లోడింగ్ చార్జి టన్నుకు రూ.30, అడ్మిన్ చార్జి రూ.20, సీనరేజి , ఇతర ఫీజులు టన్నుకు రూ.88, రవాణా ఛార్జీ కిలో మీటరుకు రూ.4.90 పైసలు గా నిర్ణయించారు. అంతేగాక 18 శాతం జిఎస్‌టి చెల్లించాలి. మొత్తంగా టన్నుకు రవాణా ఛార్జీలు కాకుండా డిపో నుంచి టన్నుకు రూ.192 డిజిటల్ పేమెంట్ ద్వారా చెల్లించి ఇసుక తీసుకోవచ్చునని అధికారులు తెలిపారు.

2లో

పల్నాడు జిల్లాలో ఇసుక నిల్వల వివరాలు

స్టాక్ యార్డు పేరు	ఇసుక నిల్వ (మెట్రిక్ టన్నులలో)
వైకుంఠపురం	64,467
క్రోసూరు	49,171
కొత్తపల్లి	24,393
మాదిపాడు	75,878
వినుకొండ	15,402
కొండమోడ	10,588
మొత్తం	2,39,900 టన్నులు



గుంటూరు జిల్లా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ



పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి లత్కార్

ఉచిత ఇసుకను పారదర్శకంగా అమలు చేయాలి

జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరవ్ కుమార్ ప్రసాద్

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుకపై నూతన విధానాన్ని రూపొందించిన జిల్లాలో ఆమేరకు ఇసుక సరఫరాపై తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ అధికారులకు సూచించారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్‌ప్రసాద్ ఉచిత ఇసుక విధి విధానాలపై జిల్లా కలెక్టర్లు , ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో గుంటూరు కలెక్టరేట్ నుండి కలెక్టర్ నాగలక్ష్మీ , ఎస్పీ తుషార్‌దూడి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్‌జైన్, డిఆర్‌ఓ పెద్ది రోజా పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక కోసం ప్రజలు ఇబ్బంది పడకుండా ఉచితంగా సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం విధివిధానాలు రూపొందించిందని , ఆ మేరకు సోమవారం ఉదయం 6 గంటల నుండి ప్రజలకు అవసరమైన ఇసుకను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సరఫరా చేసే ఇసుక నాణ్యతగా ఉండేటట్లు చూడాలని, రేవుల వద్ద వాహనంలోకి ఇసుక లోడింగ్ ఖర్చు , ప్రయాణ ఖర్చులు మాత్రమే ఉంటాయన్నారు. ప్రజల కొరకు మైన్స్ అండ్ జియాలజీ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు అందుబాటులో వుంచాలన్నారు. వినియోగదారులు తమ ఆధార్, ఇతర ధవీకరణ పత్రాలు చూపి ఇసుక తీసుకోవచ్చన్నారు. జిల్లాలో గుండిమెడ , మున్నంగి , కొల్లిపర డిపో , తాళ్లాయపాలెం , లింగాయపాలెం వద్ద అవసరమైనంత ఇసుక

2లో



నరసరావుపేట డిఎస్‌పి కార్యాలయంలో ఎఎస్‌పి లక్ష్మీపతికి వినతి పత్రం ఇస్తున్న వి శ్రీనివాసరావు, తదితరులు

పింఛనుదారులకు అండగా ఉంటే దాడులు చేస్తారా?

- దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలి
- నరసరావుపేట ఆస్పత్రిలో రామారావుకు వి శ్రీనివాసరావు పరామర్శ

వార్త మెయిన్‌లో



వినుకొండలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

8లో

మిర్చి విత్తనాలు, పురుగు మందులు సీజ్

గుంటూరులో రూ.5.80 లక్షల మిర్చి విత్తనాలు సీజ్ - పల్నాడు జిల్లా వినుకొండలో రూ.7లక్షల 30 వేల పురుగుమందులు సీజ్

హోర్డింగ్స్ ఏజెన్సీలకు నోటీసులు

రూ.9 కోట్ల బకాయిలు ఉన్నట్టు గుర్తింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు నగర పాలక సంస్థలో పలు ప్రైవేటు ఏజెన్సీలునిర్వహిస్తున్న హోర్డింగ్స్ ద్వారా వసూలు చేయాల్సిన సొమ్ముపై పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. గత కొన్నేళ్లుగా హోర్డింగ్స్ ఏజెన్సీల నుంచి బకాయిలు వసూలు చేయడంలేదని, నగరంలో జంబో హోర్డింగ్స్ ప్రమాదకరంగా మారాయని గత నెల 30న ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన వార్తకు నగర కమి షనర్ చేకూరి కీర్తి స్పందించారు. మొత్తం బకాయిల వివరాలు తెలుసుకున్నారు. గత రెండేళ్లుగా రూ.9 కోట్ల వరకు బకాయిలు వున్నట్టు గుర్తించారు. తక్షణం ఏజెన్సీలకు నోటీసులు ఇచ్చి బకాయిలు వసూలుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. ఈమేరకు నోటీసులు ఇచ్చే పనిలో అధికారులు నిమగ్నం అయ్యారు. మరో వైపు జంబో హోర్డింగ్స్ ప్రమాదకరమని కొంత మంది కార్పొరేటర్లు చాలా కాలంగా వాదిస్తున్నారు. అయినా పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు పట్టించుకోలేదు. ఈనేపథ్యంలో టిడిపి నాయకులు వీటిపై ఆరా తీశారు. హోర్డింగ్స్ ఏజెన్సీల నిర్వాహకులు ప్రజల నుంచి ప్రకటనకు రూ.లక్షల్లో వసూలు చేస్తూ కార్పొరేషన్‌కు ఫీజులు చెల్లించడం లేదని కొంత మంది ఇటీవల కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈసారి సమీక్షలో ఈ అంశంపై చర్చిస్తామని మంత్రి చంద్రశేఖర్ టిడిపి నాయకులకు చెప్పినట్టు తెలిసింది. దాదాపు రూ.9 కోట్లవరకు బకాయిలు వుంటే వసూలు చేయకుండా వదిలి వేయడాన్ని ఆయన సీరియస్‌గా తీసుకున్నారు. అంతేగాక ఈ ఏజెన్సీలకు వైసిపి నాయకుల అండదండలు ఉన్నాయని టిడిపి నాయకులు గుర్తించారు. అంతేగాక ఏజెన్సీల నుంచి వైసిపి నాయకులకు ముడుపులు ముట్టాయని మాజీ ఎమ్మెల్యే బంధువు ఒకరు వీటిని నిర్వహిస్తున్నారని తెలిసింది. దీంతో నగరపాలక సంస్థ ఆర్థిక వ్యవహారాలపై టిడిపి నాయకులు దృష్టిసారించారు. అంతేగాక నగర పాలక సంస్థలోని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు కొంత మంది ఏజెన్సీ నిర్వాహకులతో వ్యాపార భాగస్వాములుగా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. బినామీల వ్యవహారంపైకూడా టిడిపి నాయకులు దృష్టిసారించారు. పట్టణ ప్రణాళిక విభాగంలో ఏళ్ల తరబడి పాతుకుపోయిన వారినితక్షణం బదిలీ చేయాలని కొంత మంది నాయకులు మునిసిపల్ మంత్రి పి.నారాయణ దృష్టికి తీసుకువెళ్లారు.

నేడు షుగర్, బిపి, థైరాయిడ్‌పై ఆరోగ్య సభ

ప్రజాశక్తి-గుంటూరు

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం షుగర్, బిపి, థైరాయిడ్ వ్యాధులపై అరండల్‌పేట 15/1, కుబేరా టవర్స్‌లోని సంస్థ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఆరోగ్య సభ నిర్వహి స్తున్నట్లు అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఎ.సృజన్‌కుమార్ పాల్గొని ప్రసంగిస్తారని, వ్యాధులపై అవగాహన కల్పిస్తారని, సందేహాలు నివృత్తి చేస్తారని తెలిపారు. కావున ఆరోగ్యాభిలాషులు అందరూ వినియోగించుకోవాలని కోరారు.

భోజనం ప్లేట్లు పంపిణీ

ప్రజాశక్తి-తాడేపల్లి

మంగళగిరి సిటీ కేబుల్ ఎండి రావూరి రమేష్‌బాబు తండ్రి రావూరి నరసింహారావు నాల్గో వర్ధంతి సందర్భంగా తాడేపల్లి పట్టణంలోని బ్రహ్మానందపురం అంగన్‌వాడీ పాఠశాలలో 25 మంది విద్యార్థులకు శనివానం భోజనం ప్లేట్లు పంపిణీ చేశారు. నరసింహారావు యోగా గురువుగా అందరికీ సుపరిచితులు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, కె.శివప్రసాదరావు, బాబూరావు, బి.రామకృష్ణారావు, కె.విజయకుమార్, డి.యోబులు, ఎస్‌కె సైదులు, కె.అశోక్, జి.ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.

లైబ్రరీ నిర్వహణకు సూచనలు

ప్రజాశక్తి-తాడేపల్లి

మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో తాడేపల్లి అమరావతి ఐకాన్‌లో నిర్వహిస్తున్న లైబ్రరీకి అందులో మంచి అనుభవం ఉన్న విజయవాడ లైబ్రేరియన్ విజయకుమార్ పలు సూచనలు చేశారు. శనివారం ఐకాన్‌లోని క్లబ్ హౌస్‌లో నిర్వహిస్తున్న లైబ్రరీకి వచ్చి పలు పుస్తకాలను పరిశీలించారు. మంచి సాహిత్యం అందుబాటులోకి తేవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రపథమంగా తాడేపల్లి ప్రాంతంలో అపార్టుమెంట్ల ఏరియాలో లైబ్రరీలు నిర్వహించడం మంచి పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రాల రాష్ట్ర కన్వీనర్ పి.మురళీకృష్ణ, బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి, నిర్వాహకులు ఎం.మనోహర్‌రెడ్డి, సంధ్యారాణి, రమాదేవి పాల్గొన్నారు.

ఇసుక రీచ్ పరిశీలించిన తహశీల్దార్

ప్రజాశక్తి - తుళ్లూరు

కలెక్టర్ ఆదేశాల మేరకు తహశీల్దార్ సుధీర్,సెబ్ (స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో) సిఐ ప్రసన్నా,తుళ్లూరు సిఐ అనూరాధ ఇసుక రీచ్ లను శనివారం పరిశీలించారు.మండలంలోని రాయపూడి, లింగాయపాలెం, తాళ్లాయపాలెం ఇసుక రీచ్ ల వద్దకు వెళ్లి అక్కడి పరిస్థితులు గురించి ఆరా తీశారు. ఈ నెల 8 వ తేదీ నుంచి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయ నున్న నేపథ్యంలో ఇసుక రీచ్ లను తహశీల్దార్,సిబ్బంది పరిశీలించారు. రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు, పరిసర గ్రామాల్లో నిర్మాణ రంగం ఊపందుకునే అవకాశం ఉన్నందున ఇసుక వినియోగం పెరుగుతుంది.ఈ నేపథ్యంలో ఇసుక నిల్వలు,రవాణా,రీచ్ ల వద్ద సి సి కెమెరాల ఏర్పాటు తదితర అంశాలను అధికారులు పరిశీలించారు.కార్యక్రమంలో ఎస్ ఐ అంకమ్మ, సర్వేయర్ రామాంజనేయులు, వి ఆర్ ఓ ఎం కొటేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం జాతీయ రహదారి పై రోడ్డు దాటుతున్న వ్యక్తిని వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో దుర్మరణం పాలైన ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలు ...ఎంటిఎంసి పరిధిలోని బ్రహ్మానందపురానికి చెందిన నెమలి కంటి రాజు (57) శనివారం ఉదయం తాడేపల్లి పట్టణం బ్రహ్మానందపురం నుండి వడ్డేశ్వరం జాతీయ రహదారి 16 దాటుతుండగా గుంటూరు వైపు నుండి వేగంగా వస్తున్న లారీ ఒకసారిగా రోడ్డు దాటుతున్న రాజును ఢీకొంది. దీంతో రాజు వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో తల మొండెం వేరయ్యాయి. విషయం తెలుసుకున్న రాజు కుటుంబ సభ్యులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని, కన్నీరు మున్నీరయ్యారు. వెంటనే తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, దర్యాప్తు ప్రారంభించారు. అనంతరం వేరైనా నెమలి కంటి రాజు తల, మొండెం ను తాడేపల్లి పోలీసులు మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మతుడు నెమలి కంటి రాజు కొడుకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తాడేపల్లి రూరల్ ఎస్సై రమేష్ తెలిపారు.

సిపిఎం నాయకుడిపై టిడిపి దాడి హేయం

కామినేని రామారావుపై దాడిని ఖండించిన పలువురు నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

పల్నాడు జిల్లా రొంపిచర్ల మండల సిపియం నాయకులు కామినేని రామారావుపై తెలుగుదేశం కార్యకర్తలు దాడి చేయటం హేయం అని సిపియం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 1న గ్రామంలో పెన్షన్లు పంపిణీ సందర్భంగా పెన్షన్లు రానివారు సిపియం నాయకుని వద్దకు వెళ్ళి తమ సమస్యను చెప్పుకోగా జిల్లా కలెక్టర్ వద్దకు వెళ్ళి సమస్యను తెలియచేసి పెన్షన్ ఇప్పించారన్నారు. దీనికి ఆగ్రహించిన పెత్తందార్లు పథకం ప్రకారం రామారావుపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. రామారావు గతంలో గ్రామ సర్పంచ్‌గా పనిచేయడమే కాకా, ప్రస్తుతం కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షునిగా పనిచేస్తున్నారన్నారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడే వారిపై దాడిచేయడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిందుతులను అరెస్టు చేయాలని లేనిచో ఆందోళనకు పూనుకుంటామన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి

పింఛను లబ్ధిదారులకు అండగా నిలిచారనే అక్కసుతో రొంపిచర్ల మండలానికి చెందిన సిపిఎం నాయకులు రామారావుపై టిడిపి గూండాలు దాడి చేయడాన్ని సిపిఎం పట్టణ కమిటీ తరపున బూరుగ వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ అధికారుల ద్వారా ఇవ్వాల్సిన పింఛను టిడిపి నాయకులు ఇంటికి పిలిపించి ఇవ్వడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కక్షపూరితంగా కొన్ని పింఛన్లు నిలుపుదల చేయడం పట్ల రామారావు జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి లబ్దిదారులకు పింఛను ఇప్పించారనే అక్కసుతో ఇటువంటి దాడులకు పాల్పడటం శోచనీయమన్నారు. ఇలాగే పాలన సాగితే జగన్ పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు.

పల్నాడు జిల్లా : సిపిఎం సీనియర్ నాయకులు కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కామినేని రామారావుపై అధికార టిడిపి నాయకులు దాడి దుర్మార్గమని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్ అన్నారు. ఈ మేరకు శనివారం రామారావును ఫోన్లో పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసు కున్నారు.

ప్రజాశక్తి-ఫిరంగిపురం

ఫిరంగిపురం సిపిఎం పార్టీ మండల కార్యదర్శి షేక్ మస్తాన్ వలి నరసరావుపేటలోని ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పరగడచర్ల సిపిఎం నాయకులు కామినేని రామారావును పరామర్శించారు.

ప్రజాశక్తి బెల్లంకొండ /అమరావతి : సిపిఎం పార్టీ నాయకులు కామినేని రామారావుపై అధికార టిడిపి నాయకులు దాడిని ఖండిస్తూ సిపిఎం పార్టీ అమరావతి మండల కార్యదర్శి బి. సూరిబాబు ఎస్డి మొహుద్దీన్ వలి విలేకరులతో మాట్లాడుతూ సిపిఎం నాయకులు కామినేని రామారావుపై టిడిపి నాయకుల దాడిని ఖండించారు. దాడి చేయడం అమరావతి సిపిఎం కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు.

ప్రజాశక్తి..చిలకలూరిపేట

పల్నాడు జిల్లా కౌలు రైతు సంఘం అధ్యక్షులు కామినేని రామారావుపై దాడి హే యమైన చర్య అని దాడి చేసిన వారిపై తక్షణమే కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని సిఐటియు మండల కన్వీనర్ పేరు బోయిన వెంకటేశ్వర్లు శనివారం అన్నారు. స్థానిక పండరీపురం రెండవ లైన్లో గల సి ఐటియు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫేంక్షన్లను ఇంటింటికి వెళ్లి ఇవ్వమని చెప్పిన కొనసాగటం లేదని ప్రశ్నించిన కామినేని రామారావుపై దాడి చేయడం సమంజసం కాదన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.



ఉద్యానవన శాఖ అధికారిగా నిత్యశ్రీ

ప్రజాశక్తి పెదకూరపాడు

పెదకూరపాడు జోన్ ఉద్యానవన శాఖ అధికారిగా నిత్యశ్రీ శనివారం బాధ్యతలు చేపట్టారు. గత ఆరు నెలల నుంచి ఇంచార్జి ఉద్యానవన శాఖ అధికారిగా చిలకలూరిపేటకు చెందిన కిరణ్ కుమార్ పనిచేశారు. రెగ్యులర్ ఉద్యానవన శాఖ అధికారిగా నిత్యశ్రీ విధుల్లో చేరారు. నిత్యశ్రీ ఇప్పటివరకు సెలవులో ఉన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యానవన రైతులకు అందుబాటులో ఉంటామన్నారు. పంట పై వచ్చు చీడపీడల గురించి తగు సలహాలు ఇస్తామన్నారు.

క్రోసూరు పీహెచ్సీ వైద్యాధికారిగా ఇన్నారావు

ప్రజాశక్తి- క్రోసూరు

ఉద్యోగులు, ఏఎన్ఎంలు, ఇతర సిబ్బంది తీవ్ర ఆరోపణల నేపథ్యంలో క్రోసూరు పీహెచ్సీ వైద్యాధికారిణి డాక్టర్ బాల అంకమ్మ బాయిని అధికారులు బదిలీ చేశారు. ఆమె స్థానంలో అచ్చంపేట మండలం మాదిపాడు పీహెచ్సీ వైద్యా. దికారి డాక్టర్ ఇన్నారావును క్రోసూరు పీహెచ్సీ వైద్యాధికారిగా పూర్తి బాధ్యతలతో నియమించారు. డాక్టర్ బాల అంకమ్మబాయిని సత్తెనపల్లికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. పీహెచ్సీ ఉద్యోగులు కొంత కాలంగా డాక్టర్ బాల అంకమ్మబాయిపై ఆరోపణలుచేస్తూ వస్తున్నారు. ఆమెను బదిలీ చేయక పోతే తామంతా మూకుమ్మడి సెలవులు పెడతామని, బదిలీ చేయించుకొని వెళ్ళి పోతామని, అవసరమైతే నిరసన, ప్రదర్శనలు చేపడ తామని హెచ్చరిం చటమే కాక జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు కూడాచేశారు. ఈక్రమంలో రెండు రోజుల క్రితం ఆమెపై శాఖాపరమైన విచారణ జరిపారు. విచారణ పూర్తయిన రెండే రోజే డాక్టర్ బాల అంకమ్మబాయిని బదిలీ చేయటమే కాక ఆమె స్థానంలో డాక్టర్ ఇన్నా రావును నియమించారు. బాల అంకమ్మబాయి బదిలీతో పీహెచ్సీ ఉద్యోగులు, ఏఎన్ఎంలు హర్షం వ్యక్తం చేశారు.

చేపల పెంపకానికి వ్యర్థాలు వినియోగిస్తే చర్యలు

ప్రజాశక్తి చేబ్రోలు

చేపలకు ఆహారంగా కోళ్ళ వ్యర్థాలు, ఇతర కుళ్ళిన ఆహార పదార్థాలను వినియోగించుట ప్రభుత్వము నిషేధించటమైందని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఎం ఎస్ ప్రశాంత్ తెలిపారు. చేపలు సాగు చేయుటకు మత్స్య శాఖ అధికారుల అనుమతి తప్పనిసరి అని అన్నారు. అనుమతి లేని చెరువులను తొలగించడం జరుగుతుందని హెచ్చరించారు. లైసెన్సు ఉండి వ్యర్థాలను వినియోగించినా చర్యలు తప్పవని తెలిపారు. గురువారం తహసిల్దార్ కార్యాలయంలో మండల స్థాయి ఫిషరీష్ కమిటీ సమావేశము నిర్వహించడం జరిగిందని తెలిపారు.తహసీల్దారు సూర్య నారాయణ సింగ్ మాట్లాడుతూ ప్రభుత్వ నియమాలకు వ్యతిరేకంగా చేపల పెంపకాలు చేసే రైతులపై మత్స్య శాఖ అధికారులు సిబ్బంది ప్రత్యేక నిఘా ఉంచాలని అన్నారు. చేపలు సాగు చేసిన ఎడల చట్ట ప్రకారం జరిమానా విధించడంతోపాటు, చెరువులను తొలగించటం జరుగు తుందని తెలిపారు. వ్యర్థాలను వినియోగం పై రైతులకు ముందస్తు నోటీసులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. కార్యక్రమానికి సురేష్ బాబు ఎస్ హెచ్ ఓ తరపున , జి. రాంబాబు. ప్రవీణ వి ఆర్ ఓ , బి. రత్నకుమారి వి ఆర్ ఓ, ఎస్. మాధవి విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

నేడే ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి పెదకూరపాడు

పెదకూరపాడు లోని ఆర్.సి.యం ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం జరుగుతుందని నిర్వాహకులు డాక్టర్ కె రత్తయ్య తెలిపారు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేశామన్నారు. పెదకూరపాడు పరిసర గ్రామ ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని వినియోగి ంచుకోవాలని కోరారు.

రేపటి నుంచి ఉచిత ఇసుక

(మొదటిపేజీ తరువాయి)

అంతేగాకుండా ప్రస్తుతం ఉన్న స్టాక్ యార్డుల తోపాటు ఇసుక రీచ్‌లు వైకుంఠ పురం-2, ధరణికోట, దిడుగు, చామ్రు, మాదిపాడులలో రూ.200 అదనంగా చెల్లించి బోట్స్‌మెన్ సొసైటీకి ప్రొడక్షన్ ధర చెల్లించి ఇసుక పొందవచ్చునని పల్నాడు జిల్లా గనులు, భూగర్భ వనరులశాఖ అధికారిని నాగిని తెలిపారు. ఒక్కొ వినియోగదారుడికి రోజుకు గరిష్టంగా 20 టన్నులు మాత్రమే ఇస్తా మన్నారు. స్టాక్ యార్డు వారీగా ఒఎంఈపిఎస్ పోర్టల్‌లో వివరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇందుకు సంబంధించిన టోల్ ఫ్రీనెంబరు 1800 4256029కు ఎవరైనా తమకు ఎదురయిన ఇబ్బందులపై ఫిర్యాదులు చేయవచ్చునని తెలిపారు. మరో వైపు గుంటూరు, పల్నాడుజిల్లాల్లో గత నెల రోజులుగా రీచ్‌లలో ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి. గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరగ్గా ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజు నుంచి అధికారులు జిల్లా వ్యాప్తంగా తవ్వకాలు నిలిపివేశారు. నదీ పరివాహక ప్రాంతంలో జిల్లాలో మొత్తం 56 ఇసుక రీచ్‌లు ఉండగా ఇందులో 20 రీచ్‌లకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతి లేదని ఆరు నెలల క్రితమే నిలిపివేశారు. అయితే వీటిల్లో అనధికారిక తవ్వకాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు వెల్లడంతో తిరిగి వీటిపై పరిశీలన చేయాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. వీరి పరిశీలన, నివేదికలు కూడా వివాదాస్పదంగామారాయి. ఈ నేపథ్యంలో నూతన ప్రభుత్వం కొత్త ఇసుక విధానం సోమవారం నుంచి అమలు చేస్తున్నట్టు ప్రకటించింది. గత ప్రభుత్వ హయంలో ఇసుక తవ్వకాలు జరిపి ఎన్నికలకు ముందే స్టాక్ యార్డులకు తరలించిన వైసిపి నాయకుల వీటిని విక్రయించుకునేందుకు ప్రయత్నించగా స్థానికులు, పోలీసులు ఎక్కడిక్కక్కడ అడ్డుకున్నారు. దీంతో స్థానికంగా వినియోగించుకునేందుకు ఒక్కలారీ, రెండు లారీలు కూడా కొనుగోలుచేయలేని పరిస్థితి వినియోగదారులకు ఏర్పడింది. ఈ నేపథ్యంలో సంబంధిత స్టాక్ యార్డులలోని నిల్వలను ఉచిత ఇసుక విధానం ద్వారా పలు రకాలా ఛార్జీలతో ప్రజలకు ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు.

ఉచిత ఇసుకను పారదర్శకంగా అమలు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

అందుబాటులో వుందన్నారు. వినియోగదారులకు ఎలాంటి సమస్యలు రాకుండా , భవన నిర్మాణదారులకు భారం లేకుండా ఉచిత ఇసుక విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఇసుక నూతన విధానం అమలులోకి వచ్చినందున ఎలాంటి అక్రమాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉచిత ఇసుక విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. అలాగే ఇసుక నిరంతరం అందుబాటులో వుంటుందనే విషయాన్ని ప్రజలకు తెలపాలన్నారు. ఇసుక పాయింట్ల వద్ద సీసీ కెమెరాలు అమర్చి మానిటర్ చేయాలని ఆదేశించారు. ఇసుక రీచ్‌ల వద్ద 24 గంటలు పర్యవేక్షణ వుండేలా రెండు షిఫ్టులలో సిబ్బందికి డ్యూటీలు వేయాలన్నారు. మండల స్థాయి , గ్రామ స్థాయి ఇసుక కమిటీ లను ఏర్పాటు చేసి ఉచిత ఇసుక సరఫరా విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఇసుక రీచ్ ల వద్ద వాహనాలు వెళ్ళడానికి రోడ్లు , ఇసుక లోడింగ్ కొరకు వచ్చే వాహనాల పార్కింగ్ కు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందిస్తున్నందున ఫస్ట్ కం - ఫస్ట్ సర్వ్ పద్ధతి మేరకు వినియోగదారులకు ఇసుక సరఫరా చేపట్టాల్సి వుంటుందన్నారు. సమావేశంలో ఆర్డిఓ శ్రీఖర్, గనులు, భూగర్భ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్, డీఆర్డీఎ పీడీ హరిహరనాథ్, గ్రౌండ్ వాటర్ డిప్యూటీ డైరెక్టర్ వందనం వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : 8 వతేదీ నుండి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెడుతున్న ఉచిత ఇసుక పాలసి అమలుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లా కలెక్టర్లు, ఎస్పిలకు సూచించారు. శనివారం రాష్ట్ర సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లు, ఎస్పిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 1 వ తేదిన సామాజిక పించన్ల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినందున ఆయన జిల్లా కలెక్టర్లను అభినందించారు. రానున్న 3 నెలల కాలంలో ఉచిత ఇసుక పాలసి ని పారదర్శకంగా ,ప్రశాంతంగా అవసరమైన వారికి అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు మరియు గనులు భూ గర్భ శాఖాధికారులు సమవ్యయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమానికి పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీ శ్రికేష్ బి లత్కార్ మరియు అడిషనల్ ఎస్పీ ఆర్. రాఘవేంద్ర తదితరులు స్థానిక నరసరావుపేట కలెక్టరేట్ నుండి వీక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి లత్కర్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో 6 ఇసుక రీచ్ లలో 2,39,900.49 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని 5 డీ-సిల్టింగ్ పాయింట్ లు ఉన్నాయని వివరించారు. 6 ఇసుక రీచ్ లలో సంబంధిత మండల రెవిన్యూ అధికారులచే పంచ నామా నిర్వహించి లిఖిత పూర్వకంగా ఇసుక నిల్వలు తీసుకోవడం జరుగుతుందని, అదే విధముగా ఆయా ఇసుక రీచ్ లలో ఇంచార్జ్ లను నియ మించడం జరుగుతుందని ప్రధాన కార్యదర్శికి తెలిపారు. ఈ కార్యక్రమములో జిల్లా రెవెన్యూ అధికారి కె. వినాయకం, గనులు బూగర్భ శాఖాధికారి నాగిని పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - మాచర్ల

ఆర్థిక లావాదేవీలు, వివాహేతర సంబంధం నెపథ్యం లోనే వెల్దుర్తి మండలం మిట్టమీదపల్లెలో ఈ నెల 4వ తేదిన పులి చినవెంకటరెడ్డి (48)హత్య జరిగినట్లు గురజాల డిఎస్‌పి సిహెచ్ శ్రీనివాసరావు వివరించారు. స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో డిఎస్‌పి సిహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ అదే గ్రామానికి చెందిన ముద్దాయి జింకల పోలిరెడ్డి (66) పద్మ అనే మహిళతో సహ జీవనం చేస్తున్నాడు. ముద్దాయికి మద్యం తాగే అలవాటు ఉంది. అక్కడే హతుడు చినవెంకటరెడ్డితో కలిసి మద్యం సేవించేవారు. ముద్దాయి సహజీవనం చేసే మహిళ పద్మతో చినవెంకటరెడ్డి వివాహేతర సంబంధం పెట్టుకోవటం పోలిరెడ్డి కంటపడింది. ఇరువురి మధ్య వివాదం జరిగింది. ఆ తరువాత దాచేపల్లికి చెందిన మరో మహిళ లక్ష్మిని తెచ్చుకోని ముద్దాయి సహజీవనం చేస్తున్నాడు. ముద్దాయికి మార్చి నెలలో కిడ్నిల సమస్య వస్తే రూ 3లక్షలు చినవెంకటరెడ్డికి ఇచ్చి ఖర్చు పెట్టమన్నాడు. రూ 60 నుండి 70వేల వరకు ఖర్చు అయినట్లు, మిగతా మొత్తానికి లెక్కలు అడగగా ఇరువురి మధ్య గొడవ జరిగింది. ఈ రెండు కారణాలను



మనస్సులో పెట్టుకుని ముద్దాయి చినవెంకటరెడ్డిని చంపాలనే ఆలోచనతో ఈ నెల 4వ తేదిన ఉదయం 10 గంటలకు పోలిరెడ్డి, చినవెంకటరెడ్డిలు కలిసి కుంకుడు చెట్టు తండా వద్దకు వెళ్ళి మద్యం తాగారు. మద్యం మత్తులో ఉన్న చినవెంకటరెడ్డిని పోలిరెడ్డి గోడ్డలితో దాడి చేయగా చినవెంకటరెడ్డి అక్కడికక్కడే మరణించాడు. జిల్లా ఎస్‌పి మల్లికాగార్గ్ అదేశాలతో సిఐ సురేష్, ఎస్‌ఐలు రాజశేఖర్, సత్యనారాయణ, పట్టాబిలు టీమ్‌గా ఏర్పాడి శనివారం ముద్దాయి పోలిరెడ్డి శిరిగిరిపాడు చెక్‌పోస్టు వద్ద ఉండగా మధ్యవర్తుల సమక్షంలో ఆరెస్టు చేసినట్లు తెలిపారు. చినవెంకటరెడ్డిని చంపిన గొడ్డలిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముద్దాయి పోలిరెడ్డిని రిమాండ్ నిమిత్తం కోర్టుకు హజరు పర్చినట్లు తెలిపారు. సమావేశంలో రూరల్ సిఐ కె సురేష్ ఎస్.ఐలు సత్యనారాయణ (వెల్దుర్తి), రాజశేఖర్ (మాచర్ల రూరల్), పట్టాబి(విజయపురిసౌత్)లు పాల్గోన్నారు.

పోలేపల్లిలో మహిళ హత్య

ప్రజాశక్తి -దుర్గి

పోలేపల్లి గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి తరవాత భార్యను భర్త హత్య చేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. కారంపూడి సిఐ ఏ శ్రీనివాస్ వివరాలు ప్రకారం పోలేపల్లి గ్రామానికి చెందిన షేక్ సిలార్ బి(40)ని భర్త షేక్ ఖాదర్ వలీ గత కొంతకాలంగా అనుమానిస్తూ ఇరువురి మధ్య గొడవలు జరిగేవి శుక్రవారం అర్ధరాత్రి తర్వాత ఇంట్లో నిద్రొస్తున్న సిలార్బి ని మంచం కోడుతో భర్త ఖాదర్ వలీ తలపై బలంగా కొట్టాడు దీంతో సిలార్బి అక్కడికక్కడే మృతి చెందింది ఉదయం కుటుంబ సభ్యుల సమాచారం మేరకు గురజాల డిఎస్పి శ్రీనివాస్ కారంపూడి శ్రీనివాస్ సిబ్బందితో కలసి సంఘటన స్థలంలో వివరాలు సేకరించారు మృతురాలు తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశం నిర్వహించి పై వివరాలు తెలిపారు అనంతరం ఆత్మకూరు సమీపంలోని మిర్చి ప్రాంతంలో ఖాదర్ వలీ అనుమానంగా బస్సు ఎక్కేందుకు ప్రయత్నిస్తుండగా అదుపులోకి తీసుకొన్నారు. కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నట్లు సీఐ తెలిపారు.



మూగజీవాలకు రక్షణ కల్పించండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మూగజీవాలు,పెంపుడు జంతుల పట్ల దయ తో పాటు రక్షణ కల్పించాలని ఎమ్మెల్యే మహ్మద్ నశీర్ అన్నారు. ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా కొత్తపేట పశువుల హాస్పిటల్ వద్ద పెంపుడు జంతువులకు వాక్సినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. నియోజకవర్గంలో పెంపుడు జంతువులు ఎన్ని ఉన్నాయి , వీధి కుక్కల ఎన్ని ఉన్నాయి గణాంకాలు సేకరించి డాష్ బోర్డు ఏర్పాటు చేయాలని, వీటిలో గవర్నమెంట్ హాస్పిటల్ లో గాని ప్రైవేట్ గా గాని వ్యాక్సినేషన్ చేసిన వివరాలు కూడా అందులో ఉండాలని పశు వైద్య అధికారులను ఆదేశించారు. కుక్కలకు రాబిస్ వ్యాధి రాకుండా వ్యాక్సిన్ వేశారు. గుంటూరు పట్టణంలో 5000 పెంపుడు జంతువులు, సుమారు 25వేల వీధికుక్కలు ఉన్నాయని, కొంత మంది వీధికుక్కలను కూడా దత్తత చేసుకుని పోషించాలనీ నసిర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో పశుసంరక్షాక శాఖ జాయింట్ డైరక్టర్ సత్యనారాయణ రాజు, డిఎంహెచ్‌వో విజయలక్ష్మి అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

నా పొలాన్ని కబ్జా చేశారు

మాజీ మంత్రి రజినిపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

చిలకలూరిపేట పట్టణంలోని పసుమర్తి గ్రామానికి చెందిన శ్రీరామ్ వెంకటే శ్వరరావు అనే వ్యక్తి పసుమర్తి గ్రామ శివారులో తనకు చెందిన ఒక ఎకరం పొలాన్ని మాజీమం త్రి రజని, వారి అనుచరులతో కబ్జా చేశార ఃని, తన పొలం తనకు ఇప్పించాలని రూరల్ పోలీసు స్టేషన్లో శనివారం నాడు పిర్యాదు చేశారు. అనంతర విలేకరులతో మాట్లాడుతూ తన తండ్రి 1987వ సంవత్సరంలో పసు మర్తి గ్రామ శివారులో ఒక ఎకరం పొలం కొన్నారని, అప్పటి నుండి ఆ పొలం తమ ఆధీనంలో వుందన్నారు ఆ పొలం అప్పటి నుండి నేటి వరకు యూనియన్ బ్యాంకులో తనఖాలో వుందన్నారు. అయితే మాజీమంత్రి విడదల రజని మద్దినగర్లో ఒక కంపెనీ కొనుగోలు చేసిందని, ఆ కంపెనీ ముందు ఎప్పటి నుంచో 34 కుటుం బాలు వున్నాయని వారు ఖాళీ చేయకపోవటంతో తనపొలంలో ఒక్కొక్కరికి సెంటుంపాతిక (1.25సెంటు) చొప్పున తప్పుడు రిజిస్ట్రేషన్లను చేసిందన్నారు. దీని తాలూకు తనకు ఏటు వంటి డబ్బు చెల్లించలేదని తెలిపారు. అంతే కాక ఈ విషయం బయటకు చెబితే చంపుతామని బెదిరించినట్లు ఆయన తెలిపారు. తన పట్టాదారు పాసుపుస్తకాలు రద్దు చేయకుండా తను హైకోర్టు నుండి స్టే కూడా తెచ్చు కున్నానన్నారు. అయితే తమ గ్రామంలో రైతుల వద్ద లంచంగా తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వటంతో తాను కూడా శాసన సభ్యులు పుల్లారావు, ఎంపీ శ్రీ కృష్ణ దేవరాయలును కలువగా వారు చిలకలూరిపేట రూరల్ సీఐ ని కలవమని చెప్పటంతో ఫిర్యాదు చేశానని అన్నారు. సీఐ తనకు న్యాయం చేస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు.

193 బస్తాల రేషన్ స్వాధీనం



ప్రజాశక్తి-క్రోసూరు : క్రోసూరు మండలం, నాగవరం గ్రామంలోని బొడ్డురాయి సెంటర్ వద్ద శనివారం అక్రమంగా తరలిస్తున్న 193 బస్తాల బియ్యాన్ని పోలీసుల పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం 3299 నెంబర్ గల మినీ లారిలో లారి ఓనర్ పెమ్మసాని బ్రహ్మేశ్వరరావు, క్లినర్ అయిన బౌనం శివ అచ్చంపేట మండల, చిగురుపాడు గ్రామానికి చెందిన పోలిశెట్టి చెంచయ్య వద్ద వున్న రేషన్ ను అచ్చంపేట నుండి నకరికల్లుకి చెందిన వెంగళరావుకు లారిలో తీసుకోని వెళ్ళుతూ వుండగా మార్గ మద్యలో క్రోసూరు మండలం, నాగవరం గ్రామంలో క్రోసూరు మండల ఎస్సై షఫీ వారిని అదుపు లోకి తీసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై షఫీ తెలిపారు.

ట్రాక్టర్ తిరగబడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నూజెండ్ల : ప్రమాద వశాత్తు ట్రాక్టర్ తిరగబడి వ్యక్తి చనిపోయిన ఘటన మండలంలో చోటుచేసుకుంది, గుర్రపునాయుడు పాలెంకు చెందిన బొల్లినేని హనుమంతరావు ట్రాక్టర్ పై వెళ్తుండగా నూజెండ్ల మండలంలోని తలార్లపల్లి గ్రామం వద్ద ట్రాక్టర్ తిరగబడి ట్రాక్టర్ కింద చిక్కుకుని చనిపోయాడు. స్థానికుల సమాచారం మేరకు ఎస్సై లక్ష్మీ నారాయణ రెడ్డి సంఘటన ఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మృ తదేహాన్ని వినుకొండలోని ప్రభుత్వ వైద్య శాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలి ంచారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.



సంక్షేమ బోర్డు నిధుల నుండి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డికి వినతులు

ప్రజాశక్తి-మాచర్ల రూరల్

కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికులను ఆదుకోవాలని భవన నిర్మాణ, ఇతర నిర్మాణ కార్మికుల యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు షేక్ బాషా, విష్ణు మొలకల అప్పారావులు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు కార్మికుల సమస్యలను ఎమ్యెల్యే దృష్టికి తీసుకొచ్చారు. గత పాలకులు సంక్షేమ బోర్డు నిధులను పక్కదారి పట్టించారని, దాంతో కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డు నిర్వీర్యం అయిందన్నారు. సంక్షేమ ఫలాలు అందక రాష్ట్రవ్యాప్తంగా వున్న 22 లక్షల మంది భవన నిర్మాణ రంగ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. బోర్డు నిధులను ఇతర అవసరాలకు మళ్ళించటంతో పెండింగ్‌లో వున్న క్లెయిమ్స్ విడుదల కాక కార్మికులంతా నాలుగేళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. నూతన ప్రభుత్వం కార్మికుల సంక్షేమ బోర్డును సంస్కరించి, కార్మికుల సంక్షేమానికి పాటుపడాలని వారు కోరారు. స్పందించిన ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి, కార్మికశాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్ళి సమస్యలు పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని వారికి హామీనిచ్చారు. వినతిప్రతం అందించిన వారిలో బత్తిన శ్రీనివాసరావు, చల్లా నాగేశ్వరరావు, రంజాన్, ఉప్పుతోళ్ళ అంజిబాబు, పలసా వెంకన్న, బత్తుల వెంకటేశ్వర్లు, షేక్ మౌలాలి, బత్తిన వెంకటేశ్వర్లు, పెయింటర్ బాబు, ఉప్పుతోళ్ళ చినదుర్గారావు, పెద దుర్గారావు, జబ్బార్ మేస్త్రీ పాల్గొన్నారు.

ఆల్ ఇండియా అడ్వాన్స్ లీడర్షిప్ క్యాంప్‌కు ఎన్‌ఇసి విద్యార్థిని ఎంపిక



పి.అనూష

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఒరిస్సా రాష్ట్రంలో ఈ నెల 2వ తేదీ నుంచి జరుగుతున్న ఆల్ ఇం డియా అడ్వాన్స్ లీడర్షిప్ క్యాంపునకు నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల మొదటి ఏడాది ఇంజనీరింగ్ విద్యనభ్య సిస్తున్న విద్యార్థిని పోలం రెడ్డి అనూష ఎంపికైనట్లు కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ సునీల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపులో నాయకత్వ లక్షణాలపై, వ్యక్తిగత అభివృద్ధి ఎన్.సి.సి క్యాడేట్స్‌కు ఆర్మీలోని ఉద్యోగావ కాశాలపై అవగాహన, శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

న్యాయవాది పాములయ్య పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి



ప్రముఖ న్యాయవాది, రచయిత, దర్శకులు, కళాకారులు, ఉషోదయ కళా పరిషత్ అధ్యక్షులు పిన్నమనేని పాములయ్య 70వ జన్మదిన వేడుకలు సత్తెనపల్లి పట్టణంలో ఘనంగా జరిగాయి. ఈ మేరకు శుక్రవారం రాత్రి తన నివాసంలో జరిగిన ఈ వేడుకలలో ఆయన వద్ద శిక్షణ పొందిన జూని యర్ లాయర్లు, న్యాయ వాద గుమస్తాలు, రంగస్థల కళా కారులు, సాహితీవేత్తలు, బంధువులు,మిత్రులు పూలమాల లతో, దశ్శాలవాలతో ఘనంగా సత్కరించారు. ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాము లయ్య కేక్ కట్ చేశారు.

కామినేని రామారావుపై దాడిని ఖండిస్తున్నాం

సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-వినుకొండ


పల్నాడు జిల్లా కౌలు రైతు సంఘం అధ్యక్షులు కామినేని రామారావు పై రొంపిచర్ల మండలం పరగట చర్ల గ్రామంలో టిడిపికి చెందిన కొందరు వ్యక్తులు దాడి చేయడాన్ని సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు శనివారం ఆపార్టీ కార్యా లయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఖండించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సామాజిక పింఛన్లు పరగడచర్ల గ్రామంలో టీడీపీ నేతల ఇంటి వద్ద పంపిణీ చేశారు. ఈ క్రమంలో నలుగురు లబ్ధిదారులకు ఇవ్వకపోవడం జరిగింది. విషయం తెలుసుకున్న సిపిఎం నాయకులు, జిల్లా కౌర్ రైతు సంఘం అధ్యక్షులు రామారావు లబ్ధిదారు విష యాన్ని కలెక్టర్ దృష్టి తీసుకెళ్ళి సమస్యను పరిష్కరించడం జరిగింది. దీంతో కోపోద్రికులైన గ్రామ టిడిపి నాయకులు రామారావు ఇంట్లో ఉన్న సమయంలో చొరబడి దాడి చేశారు. దాడిలో రామారావుకు తీవ్ర గాయాలయ్యాయి.

గాయాలపాలైన రామారావును నరసరావుపేటలోని ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించి చికిత్సలు అందిస్తున్నారు. దాడి పై అధికారులు స్పందించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం డిమాండ్ చేస్తోంది. దీంతో పాటు పెన్షన్లు అందించకుండా ఇబ్బంది పెట్టిన అధి కారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం కార్యదర్శి రాజారపు ముని వెంకటేశ్వర్లు, వై సత్య నారాయణ, పి అంజయ్య, సిపిఎం పట్టణ కార్యదర్శి బొంకూరి వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె.హనుమంత రెడ్డి, అంగల కుదురు ఆంజనేయులు, జి. నవీన్ కుమార్,తిరుమల లక్ష్మి, రంజాన్ బీ, వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు



యుటిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న పి.ప్రేమ్‌కుమార్

బోధనకు ఆటంకం కలిగించే యాప్‌లు రద్దు చేయండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పాఠశాలలో విద్యా బోధనకు ఆటంకం కలిగిస్తున్న అనేక యాప్ లను వెంటనే రద్దు చేయాలని యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు పి ప్రేమ్ కుమార్ విద్యా శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. శనివారం నరసరావుపేట పట్టణంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నరసరావుపేట మున్సిపల్ యుటిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణీకరణ పెరిగిన నేపథ్యంలో మున్సిపల్ పాఠశాలలో పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని కోరారు.గత ప్రభుత్వం మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసిందని నూతన ప్రభుత్వం అయినా పదోన్నతులు కల్పించాలని పి.ఎఫ్ అకౌంట్లను తెరవాలని కోరారు. పాఠశాలలో బోధన సమయాన్ని హరించి వేస్తున్న యాప్లను రద్దు చేయడం ద్వారా విద్యార్థులకు ఇంకా మెరుగైన విద్యను బోధించేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. ప్రాథమిక పాఠశాలలను విచ్ఛిన్నం చేసిన గత ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నెంబర్ 117 వెంటనే రద్దు చేయాలన్నారు. యుటిఎఫ్ స్థాపించి రానున్న డిసెంబర్ నాటికి 50 ఏళ్ళు పూర్తి అవుతున్న నేప థ్యంలో కాకినాడలో డిసెంబర్ నెలలో 14 నుండి 17 వరకు జరగనున్న స్వర్ణోత్సవ వేడుకలు జరుపు కోవడంపై హర్షం వ్యక్తం చేశారు. స్వర్ణోత్సవ వేడుకలలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ మెంబర్ ఆంజనేయులు యుటిఎఫ్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు డి కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, ఏడుకొండలు, ఆకిబ్, సురేష్ కుమార్, సాంబయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పిడుగురాళ్ళలో వైద్యశిబిరాల ఏర్పాటు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-పిడుగురాళ్ళ

పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న డయేరియా కేసులతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో 'డయేరియా డేంజర్' అనే వార్తకు జిల్లా వైద్యాధికారులు స్పందించారు. శనివారం పట్టణంలోని లెనిన్ నగర్, మారుతి నగర్‌లో వైద్యాధికారులు మూడు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.ఈ మెడికల్ క్యాంపుల పరిశీలనకు డిఎంఅండ్‌హెచ్‌వో వైద్యుల బి.రవిబాబు వచ్చారు.ఈ సందర్భంగా ఆయన లెనిన్ నగర్ నందు ఇళ్ళ వెంట తిరుగుతూ ప్రజలను మెడికల్ క్యాంపు ఏర్పాటు గురించి అధికారులు పనితీరు గురించి వివరాల అడిగి తెలుసుకున్నారు.లెనిన్ నగర్‌లో పారిశుధ్య పనులు, డ్రైనేజ్ వ్యవస్థను పరిశీలించి ఆసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ పట్టణంలో డయేరియా పెరుగుతున్న కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కాచి చల్లార్చిన నీటిని వాడు కోవాలని సూచించారు. పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని మున్సిపల్ కమిషనర్ గిరికుమార్‌కు తెలిపారు.ఆయా ప్రాంతలలోని ఆర్‌వో వాటర్ ప్లాంట్‌ల నుండి తాగునీరు సేకరించి గుంటూరులోని ల్యాబ్‌లకు పరీక్షల నిమిత్తం పంపించినట్లు చెప్పారు. పిడుగురాళ్ళలో నమోదవుతున్న డయేరియా కేసులు గతంలో కంటే భిన్నంగా ఉన్నాయని, కేసుల సంఖ్య పెరుగుతున్న కారణంగా వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అన్ని రకాల వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉంచా మని తెలిపారు. ఆయన వెంట జిల్లా నీటి పరీక్షల రీజనల్ ల్యారేటరీ రాజరావు,మున్సిపల్ కమిషనర్ గిరికుమార్ పాల్గొన్నారు.

గ్రీన్ ఇండియా కోసం కృషి చేయండి

ప్రజాశక్తి-మాచర్ల

గ్రీన్ ఇండియా కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని శ్రీచైతన్య స్కూల్ ప్రిన్సిపల్ అయ్యపరెడ్డి హరణి సూచించారు. శనివారం పట్టణంలో శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు గ్రీన్ ఇం డియా మిషన్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు పట్టణంలోని ప్రధాన వీధుల్లో గ్రీన్ ఇండియా కోసం తీసుకోవాల్సిన చర్యలను ప్లే కార్డులు ద్వారా ప్రదర్శిస్తూ, నినాదాలు చేస్తూ , ఎన్.సి.సి బ్యాండ్‌తో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపల్ హరణి మాట్లాడుతూ నేషనల్ మిషన్ ఫర్ ఎ గ్రీన్ ఇండియా లేదా గ్రీన్ ఇండియా మిషన్ అనేది వాతావరణ మార్పులను పరిష్కరించడానికి భారతదేశం యొక్క ఎనిమిది మిషన్లలో ఒకటని, దీనిని ఫిబ్రవరి 2014లో భారతప్రభుత్వం ప్రారంభించిందన్నారు. దీని ప్రధాన ఉద్దేశ్యం వాతావరణ మార్పులను తగ్గించడం, నీటి భద్రత, ఆహార భద్రత, జీవవైవిధ్య పరిరక్షణ,అటవీ జీవనంతో పాటు ఆధారపడిన వర్గాల జీవనోపాధి భద్రత, పర్యావరణ మెరుగుదల కోసం, పచ్చదనం పెంపుదలకు కృషి చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరు ఇంటికొక మొక్కను నాటాలని, నీటిని వృధా చేయరాదని, ప్లాస్టిక్ వస్తువులను వినియోగించరాదని, వ్యర్థాలను డస్టుబిన్‌లోనే వేయాలని, చెట్లను



నరకరాదని, పరిశుద్ధమైన వాతావరణం వుండేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు నినదించారు. ఈ ర్యాలీలో స్కూల్ డీన్ బత్తుల అనీల్ కుమార్, ఇన్‌చార్జి హారిక, టీచర్స్ నసీమా, మానస పాల్గొన్నారు.

కుళాయి నీటిని కాచి చల్లార్చి తాగండి

మున్సిపల్ కమిషనర్ కె.షమ్మీ

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పట్టణంలో కుళాయిల ద్వారా సరఫరా చేయు తాగునీటిని వర్షాకాలం కావడంతో కాచి చలార్చి తాగాలని మున్సిపల్ కమిషనర్ కె షమ్మీ పట్టణ ప్రజలకు శనివారం ఒక ప్రకటనలో సూచిం చారు. పట్టణంలో మంచినీటి సరఫరాలో ఎటువంటి సమస్యలు ఉన్న ఆయా వార్డుల సెక్రటరీలకు తెలియజేయాలని పేర్కొన్నారు.

నెల్లూరి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో

చర్మ,సుఖ వ్యాధులకు మెరుగైన చికిత్స

- **3 నెలల పాటు ఉచిత ఓపి**
- **డాక్టర్ బెల్లం అనూష**

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తమ హాస్పిటల్ లో అన్ని రకాల చర్మ మరియు సుఖ వ్యాధులకు మెరుగైన వైద్య సేవలు అందించినట్లు నెల్లూరు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత్రి ప్రముఖ చర్మ ,సుఖ,కాస్మటాలజీ వైద్య నిపుణురాలు డాక్టర్ బెల్లం అనూష అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణం సత్తెనపల్లి రోడ్డులో గల నెల్లూరు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో చర్మ సుఖ వ్యాధులకు సంబంధించి 3 నెలలపాటు (జులై, ఆగస్టు, సెప్టెంబర్) ఉచిత ఓపి విధానం అమలు చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.డాక్టర్ అనూష మాట్లాడుతూ మనిషి ఆరోగ్యాన్ని కొన్ని సందర్భాలలో చర్మ వర్ణాన్ని బట్టి అంచనా వేయొచ్చన్నారు. శరీరంపై దద్దుర్లు,రాగి రంగు మచ్చలు,అవాంఛిత రోమాలు ఉన్న వారు నిర్లక్ష్యం చేయకుండా తప్పనిసరిగా వైద్యున్ని సంప్రదించాలని కొన్ని రకాల చర్మ వ్యాధులు చిన్నవిగా ప్రారంభమై శరీరం మొత్తం వ్యాప్తి చెందుతాయని ఆదిలోనే గుర్తించడం ద్వారా అదుపు చేయొచ్చన్నారు.కొన్ని రకాల చర్మ వ్యాధులు అంటువ్యాధుల మాదిరి ప్రబలి ఒకరి నుండి మరొకరికి సోకుతాయన్నారు.చర్మ సంబంధిత వ్యాధులతో బాధ పడేవారు తమ హాస్పిటల్ లో ఉచిత ఓపి విధానాన్ని సద్వినియోగం చేసుకుని చికిత్స పొంది ఆరోగ్యంగా ఉండాలని డాక్టర్ అనూష సూచించారు.

సిపిఎం నాయకులు గంగాధరరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

సిపిఎం మంగళగిరి రూరల్ మండలం కార్యదర్శి వై గంగాధరరావు 4వ వర్ధంతి సందర్భంగా శనివారం ఘన నివాళులర్పించారు. చినకాకాని గ్రామంలో గంగాధర రావు విగ్రహాలకు, చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం కార్యాలయంలో జరిగిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడారు. గ్రామం లో సిపిఎం నిర్మాణానికి గంగాధర రావు ఎంతో కృషి చేశారని, స్థానిక సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించారని చెప్పారు. నాలెడ్జ్ పార్క్ పేరుతో రైతుల విలువైన పంట పొలాలను స్వీకరించాలని ప్రభుత్వం ప్రయత్నించినప్పుడు దానికి వ్యతరేకంగా పెద్ద ఎత్తున రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించి విజయం సాధించిండం జరిగిందన్నారు. ప్రస్తుత ఎన్నికల ముందు కేంద్రం లోని బిజెపి కుటిల ప్రయత్నాలు చేసి 400 సీట్లు వస్తాయని చెప్పి సింగిల్‌గా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం కోల్పోవాల్సి వచ్చిందని, బిజెపి ని బలహీన పర్చాలన్న పిలుపునకు అనుకూలంగా ఎన్నికల ఫలితాలు వచ్చాయన్నారు. ఇండియా ఇండియా వేదిక బలోపేతం అయిందన్నారు. పోరాటాలు, ఉద్యమాలు జరిగిన చోట, ప్రధానం గా రైతాంగ పోరాటాలు నిర్వహించిన చోట బిజెపి కి గట్టి ఎదురు దెబ్బ తగిలిందని తెలిపారు. ఆంధ్ర లో బిజెపి బలోపేతానికి టిడిపి, జనసేనా, వైసిపి లు పోటీపడటం సిగ్గు చేటన్నారు. కేంద్రంలో బిజెపి చట్టాల మార్పు చేస్తూ విపక్షాల పై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. అరుంధతి రాయ్ పై


మాట్లాడుతున్న పాశం రామారావు

14ఏళ్ల తరువాత కసు నమోదు చేశారని, శిబూ సోరేన్ నీ జైల్లో పెట్టారని పేర్కొన్నారు. నీట్ ప్రశ్నాపత్రం లిక్ చేస్తే ఎటువంటి చర్యలు వారి పై లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఆంధ్రలోని అధికార టిడిపి కూటమి రాష్ట్ర అభివృద్ధికి కషి చేయాలని కోరారు. అధికారం లోకి వచ్చాక దాడులు పరిపాటి గా జరుగుతున్నాయని, ఇది సరైనది కాదన్నారు. గంగాధర రావు స్పూర్తితో ప్రజా సమస్యల పై, రైతాంగ సమస్యలపై పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు, జిల్లా నాయకులు బి. కోటేశ్వరి, సిపిఎం నాయకులు గండికోట బాబు వర ప్రసాద్, వట్రం పూర్ణయ్య, ఆళ్ళ సాంబి రెడ్డి, గంగాధర రావు కుమారుడు గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జిటి, లాంగ్వేజ్ పండిట్ల పదోన్నతుల సీనియార్టీ జాబితా విడుదల

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లాలో మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, లాంగ్వేజ్ పండిట్ల స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులకు సంబంధించిన కామన్ సీనియర్ జాబితాను ఎవశీస్త్రత్.ఎశ్రీశీస్త్రంజూశీ.ఱఅ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి అభ్యంతరాలు ఉంటే, ఈనెల 10వ తేదీ సాయంత్రంలోగా లిఖిత పూర్వకంగా అందచేయాలని తెలిపారు.

ఇన్‌స్పైర్ మానక్‌కు నామినేషన్లు స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు

ఇన్‌స్పైర్‌మానక్ స్కీమ్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి 10-15 సంవత్సరాల వయస్సు కలిగిన 6-10 తరగతుల విద్యార్థులకు ఇన్‌స్పైర్ అవార్డుల కింద ఆన్‌లైన్ నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అయినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. కావున ప్రాథమికోన్నత, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు అందరూ ఇ-ఎంఐఎయస్ వెబ్ పోర్టల్, ఇ-మేనేజ్‌మెంట్‌లోని www.inspireawards-dst.gov వెబ్ లింక్‌లో ఆన్‌లైన్ మోడ్ ద్వారా ఐదు థీమ్‌లను నామినేట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో ఈ ప్రక్రియ జులై 1 నుండి సెప్టెంబర్ 15వ వరకూ చేయొచ్చన్నారు. కావున ఉపాధ్యాయులు వెంటనే నామినేట్ చేయాలని కోరారు. గత సంవత్సరం కంటే అధికంగా నామినేషన్స్ చేయాలని, ఇతర సమాచారం కోసం జిల్లా సైన్స్ అధికారి (గౌసుల్‌మీరా -7842869407)ని సంప్రదించాలన్నారు.

10న కార్మిక వ్యతిరేక విధానాలపై నిరసనలు

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడలు రద్దు చేయాలని, భారతీయ న్యాయ సంహిత 2023 అమలు నిలిపివేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ డిమాండ్ చేశారు. సిఐటియు గుంటూరు తూర్పు కమిటీ సమావేశం పాత గుంటూరులోని సిఐటియు కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం తూర్పు కమిటీ ప్రధాన కార్యదర్శి పి.దీవెనరావు అధ్యక్ష తన నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారం లోకి వచ్చిన వెంటనే బిజెపి ప్రభుత్వం ప్రావిడెంట్ ఫండ్ సకాలంలో చెల్లించని యజమానులకు వేసే జరిమానాలపై రాయితీలుస్తూ ఉత్తర్వులు ఇవ్వటం సరికాదన్నారు. గతంలో కనీసం ఐదు శాతం నుండి 25 శాతం వరకు చెల్లించేవారని, దీనిని కేంద్రం ఒక శాతం నుండి ఐదు శాతం వరకు తగ్గించిందన్నారు. దీనివలన భవిష్యత్తులో కార్మికులకు పీ.ఎఫ్ కూడ దక్కే పరిస్థితి లేదన్నారు. కార్మికులకు అత్యంత ప్రమాదకరమైన నాలుగు లేబర్ కోడ్‌లు చేయటమంటే కార్మికుల హక్కులు హరించడమేనన్నారు. ఈ నాలుగు లేబర్ కోడలు అమలు జరిగితే పోరాడే హక్కు కోల్పోతారని తెలిపారు. ఇటువంటి విధానాలకు వ్యతిరేకంగా సిఐటియు అఖిలభారత కమిటీ



మాట్లాడుతున్న నేతాజి

పిలుపుమేరకు ఈనెల 10న అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసన తెలియజేయాలని ఆయన పిలుపునిచ్చిందన్నారు. సిఐటియు తూర్పు కమిటీ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన నూతన రాష్ట్ర ప్రభుత్వం స్కీం వర్కర్లను తొలగించే ప్రయత్నం చేస్తుందని, ప్రభుత్వం మారితే సమస్యలు పరిష్కారం అవుతాయని భావిస్తే, తొలగించటం సరికాదన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఇసుకను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చి ఉపాధి పెంచాలని, సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, పెండింగ్ క్లైమ్‌లు విడుదల చేయాలని కోరారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నగర నాయకులు టి.శ్రీనివాసరావు, అంగన్వాడీ యూనియన్ నాయకురాలు రోజమ్మ, ముఠా యూనియన్ నాయకులు జిలాని, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రమీల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సంహిత చట్టం అమలు నిలిపివేయాలి

ప్రజాశక్తి - తుళ్లూరు

మోటారు రంగంలో పనిచేసే కార్మికులను ఇక్కట్ల పాలుచేసే భారతీయ న్యాయ సంహిత చట్టాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ శనివారం రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరులో సిఐటియు ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్ లు నిరసన తెలిపారు. నిరసన కార్యక్రమంలో సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం రవి మాట్లాడుతూ, డ్రైవర్ల మెడకు ఉరితాడుగా మారనున్న నూతన మోటార్ వాహన చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవా లని డిమాండ్ చేశారు. డ్రైవర్లకు మరణ శాసనంగా మారనున్న భారతీయ న్యాయ సంహిత చట్టం తక్షణం నిలిపివేయాలని అన్నారు. ఈ చట్టాన్ని అమలు చేస్తే డ్రైవర్లకు సంవత్సరాల తరబడి జైలు శిక్షలు పడతాయని, లక్షల రూపాయలు జరిమానాలు చెల్లించాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. 2019 ఎంవీ చట్టం సవరణను రద్దు చేయాలని, ఫీజులు, పెనాల్టీలు పెంచుతూ గత ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 21ని నూతన ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా సవరించాలని రవి కోరారు. డీజిల్ ధరలు, బీమా ప్రీమియం, టోల్ చార్జీలు నియంత్రించాలని అన్నారు.


తుళ్లూరులో నిరసన

డ్రైవర్లకు సామాజిక భద్రత చట్టం చేయాలని, కార్మిక చట్టాలన్నీ వర్తింపజేయాలని రవి కోరారు. కార్యక్రమంలో మదర్ థెరిస్సా ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు కొప్పుల యోహాన్, జెట్టి నరేంద్ర, దాసరి సాంబయ్య, మాదాసు చంటి, ఎల్ లక్ష్మణ్, దాసరి సాల్మన్ రాజు, కర్రీ శేఖర్, నేలపాటి నాగరాజు, పఠాన్ జిలాని ఖాన్, బోదాల రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కాలేజిలో శనివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో 1972 నుండి కళాశాలలో చదువుకొని వివిధ రంగాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పదవీ విరమణ పొందిన అనేక మంది పూర్వ అధ్యాపకులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు గత అనుభవాలను, పాలిటెక్నిక్ విద్య ప్రాముఖ్యతను, ప్రస్తుత ఉద్యోగావకాశాల గురించి ప్రస్తుత విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల బాగోగుల గురించి చర్చించారు. అలాగే కళాశాలలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్ మరమ్మతులకు సంబంధించి సహాయం చేస్తామని పూర్వ విద్యార్థులకు ముందుకు



వచ్చారు. అనంతరం పూర్వ విద్యార్థినులు తమ అధ్యాపకులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకరరావు, వివిధ విభాగాల హెచ్‌ఒడిలు, అధ్యాపకులు పాల్గొన్నారు.


జ్యోతిప్రజల్వన చేస్తున్న రత్నగిరిబాబు తదితరులు

మాదల శకుంతల భాస్కర్ నర్సింగ్ కాలేజిలో తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక తారాకరామ నగర్, శ్రీనివాస నగర్ కాలనీలోని మాదల శకుంతల భాస్కర్ నర్సింగ్ కళాశాలలో 18వ ల్యాంప్‌లైటింగ్ కార్యక్రమం సందర్భంగా నూతనంగా చేరిన విద్యార్థులకు ఫ్లోరెన్స్ నైటింగేల్‌పై ప్రమాణం చేసి నూతనంగా క్లాసులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కళాశాల వ్యవస్థాపకులు, వైస్ ప్రెసిడెంట్ మాదల రత్నగిరిబాబు, డాక్టర్ పాటిబండ్ల శివాజీ, కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎన్.శ్రీకాంత్, కొత్తపల్లి సుశీల, తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

శ్రీపూజిత స్కూల్లో వనమహోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక పట్టాభిపురంలోని శ్రీపూజిత స్కూల్లో శనివారం వనమహోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రకరకాల పూలు, పండ్ల మొక్కలు తీసుకొచ్చి స్కూలు ఆవరణలో వాటిని ఉత్సాహంగా నాటారు. వారు నాటిన మొక్కల పక్కనే వారి పేర్లతో ఉన్న ప్లకార్డులు పెట్టారు. అనంతరం విద్యార్థులు ర్యాలీగా వెళ్లి వాహనదారులను ఆపి, వనమహోత్సవం విశిష్టతను వివరించి, అందరికీ మొక్కలు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ కంచర్ల పద్మావతి ప్రారంభించారు. ఈ సం దర్భంగా పద్మావతి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమంలో ఆసక్తి చూపాలని అన్నారు. మానవ అవసరాల కోసం అడవుల్ని నరకడం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని అన్నారు. జులైలో కూడా వాతావరణం వేసవిని తలపిస్తుందంటే చెట్లు నరకటం వల్ల ఓజోన్ పొర దెబ్బతిని, అతినీల లోహిత కిరణాలు భూమిపై ఎక్కువగా ప్రసరించటమే అన్నారు. కావున ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఆహారం తనిఖీ చేస్తున్న ఎపిసి, ఎంఇఒ

మధ్యాహ్న భోజనం పథకం తనిఖీ

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు రూరల్ మండలం, జొన్నలగడ్డ కాంప్లెక్స్ పరిధి లోని ఎంపిపిఎస్ ఏఎన్ గోరంట్ల పాఠశాలను సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ విజయలక్ష్మి, గుంటూరు ఎంఇఒ నాగేంద్రమ్మ శనివారం సందర్శించి, మద్యాహ్నభోజనం తనిఖీ చేశారు. పిల్లలు అందరూ మద్యాహ్నభోజనం చేసే విధంగా చూడాలని, మెనూ ప్రకారం ఆహారం అందించాలని ఆదేశించారు.



ఎమ్మెల్యే పుల్లారావుకు వినతిపత్రం అందజేస్తున్న యడవల్లిదళిత రైతులు

న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

గత ప్రభుత్వ హయాంలో భూములను పోగొట్టుకున్న యడవల్లి దళిత రైతులు 2013 భు సేకరణ చట్టం ప్రకారము తమకు న్యా యం చేయాలని కోరుతూ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును శనివారం నాడు కలిశారు. ఈ సందర్భం గా సిఐటియు మండల కన్వీనర్ పేరుబోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతు భూ పోరాటం కమిటీ, కెవి పిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం, ఇతర సంఘల ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా పుల్లారావును ఆయన నివాసంలో కలిసినట్లు చెప్పారు. ఈ విషయమై ఆయనకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపోయిన వా రి న్యాయం చేయాలని,లేదా మా భూములను అప్పగించాలన్నారు. లిఫ్ట్ ఇ రిగేషన్ స్కీ మును పునరుద్ధరించి అ ప్పగించాలన్నా రు. 20 మంది దళిత రైతులు పై అన్యాయంగా పెట్టిన కేసులను తీసి వేయాలని, ఆయనకు ప లు సమస్యల పరిష్కరానికి వినతిపత్రం ఇచ్చినట్లు చెప్పారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ అధ్యక్షులు సాతులూరి లూథర్ కెవిపిఎస్ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి ఎం విల్సన్ దళిత రైతులు కాకాని రోశ య్య, తాళ్లూరు వెంకటరావు, తంగి రా ల వెంకటస్వామి, వేల్పూల సాం సంగ్, కొమ్మలపాటి శివ, సుందర్రావు, దయామని, సునీత,సంపత్, ఏ సు బాబు, తదితరులు పాల్గొన్నారు

గ్రామాల్లో ఫిల్టర్ బెడ్ లు పనిచేయట్లేదు

ప్రజాశక్తి -సత్తెనపల్లి రూరల్

గ్రామాల్లో ఫిల్టర్ బెడ్ లు సక్రమంగా పనిచేకపోటంతో తాగునీరు పచ్చగా వస్తుందని వీటిని తాగిన ప్రజలు రోగాల బారినపడి ఉంటున్నారని ఫిల్టర్ బెడ్ లకు మరమ్మతులు చేపట్టాలని ఎంపిటీసి సభ్యులు మండల పరిషత్ సమావేశంలో ప్రస్తావించారు. సత్తెనపల్లి మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఉప మండల పరిషత్ అధ్యక్షులు అన్నదాసు శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం జరిగింది. కట్టమూరు ఎంపిటీసి సభ్యులు బొగ్గవరపు గోపయ్య మాట్లాడుతూ రక్షిత మంచినీటి పథకానికి సంబంధించి ఫిల్టర్ బెడ్ లు పని చేయడం లేదని, తక్షణం మరమ్మతులు చేయాలని అధికారులను కోరారు.

పారిశుద్ధ్యం మెరుగుపరిచే పనిలో టిడిపి నాయకులు

ప్రజాశక్తి-ముప్పాళ్ళ



మండల కేంద్రం లోని ముప్పాళ్లలో పారి శుద్ధ్యం క్షీణించి ఎక్కడి కక్కడ చెత్త పేరుకు పోవడంతో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు పారిశుద్ధ్యం మెరుగుపరిచే పనిలో పడ్డారు.ఈ సందర్భంగా శనివారం గ్రామంలో ముస్లిం కాలనీ నుండి తురకపాలెం వెళ్లే రోడ్డులో జేసిబి సహాయంతో రోడ్డు వెంబడి ఉన్న చెత్త చెదారాన్ని తొలగించడంతో పాటు పిచ్చి కంప చెట్లను తొలగించారు.ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ ఇటీవల రోజు మార్చి రోజు వర్షాలు పడుతుండడంతో చెత్త కుళ్ళిపోయి వాసన వెదజల్లుతుందనీ అందుకే తురకపాలెం వెళ్ళే రోడ్డులో పారిశుద్ధ్య మెరుగు పరి చేందుకు పూనుకున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయ కులు షేక్ హకీం,షేక్ గంగారం కాశీం,షేక్ మాబు సుభాని,పఠాన్ మాబు,నాగులా,షేక్ మౌలాలి,షేక్ కాశీం,షేక్ గిడ్డ రఫీ,షేక్ రఫీ,పఠాన్ లీలాఫర్,తదితరులు పాల్గొన్నారు.

నకిలీలు విక్రయిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి -సత్తెనపల్లి రూరల్

రైతులకు నకిలీ విత్తనాలు ఎరువులు పురుగు మందులు విక్రయించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ కమిషనర్ కార్యాలయం ఏడిఏ బి వెంకటేశ్వరరావు హెచ్చరించారు. సత్తెనపల్లి పట్టణం లోని పలు విత్తన, ఎరువులు, పురుగు మందుల దుకాణాలను వ్యవసాయ అధికారులు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు తిరుమల ఎంటర్ ప్రైజ్స్ , శివా ఎంటర్ ప్రైజ్స్ , పల్నాడు సీడ్స్,అన్నదాత సీడ్స్ దుకాణాల్లో తనిఖలు నిర్వహించి రికార్డులను పరిశీలించారు.. విత్తన డీలర్ల దగ్గర సరైన కంపెనీ సోర్సు సర్టిఫికేట్ లేనందున 3లక్షల 69వేల 210 రూపాయలు విలువ గల 4.78కేజీల మిరప విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేశారు. ప్రిన్సిపల్ సర్టిఫికెట్ లేని 19వేల 650 రూపాయలు విలువ చేసే పురుగు మందుల 42.25 లీటరు , ఫారం 0 లు లేని 8 వేలు విలువ చేసే ఎరు వుల 22.5 లీ నానో యూరియ అమ్మకాలను నిలుపుదల చేశారు. మొత్తం రూ.3,96,960 విలువ కలిగిన విత్తన, ఎరువులు, పురుగు మందుల అమ్మకాలను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఏఓ రవికుమార్ సత్తెనపల్లి ఇన్చార్జి ఎడిఎ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-క్రోసూరు

క్రోసూరు లోని వివిధ విత్తన, ఎరువులు, పురుగుమందుల షాపులను తనికీ చేశారు. ఏడీఏ వెంకటేశ్వరరావు విజయవాడ, డి . రవికుమార్ ఎస్పై , విశాఖపట్నం , వి వేణుగోపాల్, ఎంఈఓ , క్రోసూరు,లైజనింగ్ ఆఫీసర్ అయిన పి . ప్రవీణ్, ఏవో పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ పవన్ ఫెర్టిలైజర్స్, కోసూరు ఎరువుల షాపులో ఎరువుల లైసెన్స్ నందు ఫారం "0" పొందుపరచని కారణంగా 20-20-0-13 (50 కేజీల బస్తా) 40 బస్తాలు సుమారు విలువ రూ.44,000 అమ్మకాలు నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు చెప్పారు.. శ్రీ లక్ష్మీ నరసింహ ఎంటర్ప్రైజెస్ షాపులో G2, G3 సర్టిఫికెట్స్ లేని కారణంగా బయో స్టిములేంట్స్ 65 లీటర్లు, విలువ రూ. 53,000 అమ్మకాలు నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు ఇచ్చామన్నారు.. ఈ షాపు నందు గడువు తేది ముగిసిన పురుగుమందులు నిల్వలు ఉండడం చేత సదరు షాపు యొక్క పురుగుమందుల లైసెన్సును సస్పెన్షన్ కోసం సిఫారసు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.





సత్తెనపల్లిలోని విత్తన, ఎరువులు, పురుగు మందుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధకారులు

ప్రజాశక్తి-ఈపూరు

మండల కేంద్రమైన ఈపూరులో రామకష్ణ ఫర్టిలైజర్, మన గ్రోమోర్ లో శనివారం వ్యవసాయ శాఖ విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు.రామకష్ణ ఫర్టిలైజర్ షాపులో నిల్వ ఉన్న పురుగు మందులు, ఎరువులు బస్తాలను క్షుణ్ణంగా వ్యవసాయ శాఖ కమిషనరేట్ డిడిఏ సిహెచ్ శ్రీనివాసరావు పరిశీలించారు. షాపులో రికార్డులను పరిశీలించి రూ .18,190 విలువ గల వాటర్ సాల్యుబుల్ మిక్సర్ కు సంబంధించి ఓ ఫామ్స్ గడువు ముగిసినందున వాటి అమ్మకాలను నిలుపుదల చేసినట్లు అధికారులు తెలిపారు.అనంతరం మన గ్రోమోర్ లో ఎరువులు, పురుగుమందులను తనిఖీ చేసి స్టాక్ రికార్డులను పరిశీలించారు. తనిఖీలలో విజిలెన్స్ ఎస్పై ఎం రామచంద్రయ్య, ఏవో బి వరలక్ష్మి, ఆర్ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

పండుగ రియల్ ఎస్టేట్ వెంచర్లో కాదు.. ఊరిలో : ఎమ్మెల్యే జీవీ

ప్రజాశక్తి-వినుకొండ

"కొండ"తొలి ఏకాదశి పండుగ ఈ ఏడాది అత్యంత వైభవంగా జరిపేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆదేశించారు. ఈనెల 17న వినుకొండ పట్టణంలో జరిగే తొలి ఏకాదశి తిరునాళ్ల ఏర్పాట్లపై శనివారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్ నందు ఎమ్మెల్యే అధికారుల, స్వచ్ఛంద సంస్థలు, పుర ప్రముఖులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినుకొండ ప్రాంత ప్రజలు తొలి ఏకాదశి పండుగ జరుపుకునేందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. తిరునాళ్లలో ఆకతాయిల అల్లర్లను అరికట్టాలని పుర ప్రముఖులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనితో స్పందించిన ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేస్తున్న వినుకొండ కొండ పండుగ తొలి ఏకాదశి భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆయన అన్నారు. గతంలో మాదిరి సాంస్కతిక కార్యక్రమాలు పట్టణంలోని జరుగుతాయని ట్రాఫిక్ కి ఎటువంటి అంతరాయం లేకుండా పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాటు చేయాలని సూచించారు. తిరుణాలలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. మొహరం, తొలి ఏకాదశి ఈ నెల 17వ తేదీన ఒకేరోజు రావడం ఎంతో విశేషమని, ఎక్కడ ఎటువంటి సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టు దిట్టమైన భద్రత కల్పించాలని సూచించారు.



ప్రాణాలు హరించే విద్యుత్తు లైన్ మార్పు

విష్ణు కుండీ నగర్, రెడ్డి నగర్ ఇండ్లను ఆనుకొని వెళ్లిన 30 కె.వి విద్యుత్తు లైను పునరుద్ధరణ పనులకు శనివారం వినకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ముగ్గురు ప్రాణాలను బలికొన్న విద్యుత్ లైన్ సమాచారం తెలుసుకున్న వెంటనే లైన్ పనులు ప్రారంభించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

ఇళ్లకు దగ్గరగా హై టెన్షన్ లైన్ వెళ్లిందని, ఈ లైన్ మార్చాలని గత ప్రభుత్వ పాలకొల వద్దకు వెళ్లి ప్రజలు మొరపెట్టుకున్న స్పందించక పోవడం దుర్మార్గమన్నారు. ప్రజలకు ప్రాణాపాయంగా ఉన్న హై టెన్షన్ లైన్ ను మార్చేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. 32వ వార్డు కౌన్సిలర్ వాసిరెడ్డి లింగమూర్తి సమస్యను తన దృష్టికి తీసుకురాగానే విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. వెంటనే అంచనాలు తయారుచేసి 30 కె.వి లైన్ ను మార్చేందుకు పనులు ప్రారంభించామన్నారు.

స్టేడియం అభివృద్ధిపై అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

శారీరక దృఢత్వానికి మానసిక పునరుత్తేజానికి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట సత్తెనపల్లి రోడ్డులో గల డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణాన్ని శనివారం అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడా ప్రాంగణంలో మెరుగైన వసతులు కల్పించడంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. మండల కేంద్రం రొంపిచర్లలో శనివారం ఎమ్మెల్యే పర్యటించారు. మండల పరిషత్ కార్యాలయం వద్దే తహశీల్దార్ కార్యాలయం ఉండడం ప్రజలకు అనుకూలంగా ఉంటుందని ఈ నేపథ్యంలో పాత తహశీల్దార్ భవనంలోకి మారుస్తున్నట్లు ఎమ్మెల్యే అన్నారు.



క్రీడా ప్రాంగణంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవింద బాబు

జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-వినుకొండ



భారతదేశ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 38 వర్ధంతి వేడుకలు కుల వివక్ష పోరాట సంఘం (కెవి పిఎస్) ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. స్థానిక మున్సిపల్ కార్యా లయం వద్ద ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి కెవిపిఎస్ ప్రజాసంఘాల నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. జగ్జీవన్ రామ్‌కు భారతరత్న ప్రక టించాలని కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. **ప్రజాశక్తి- క్రోసూరు:** బాబు జగ్జీవన్ రామ్ జీవితం నేటి యువ తకు స్ఫూర్తి దాయకమని క్రోసూరు మండల టిడిపి నాయకులు అన్నారు. **ప్రజాశక్తి- సత్తెనపల్లి:** స్థానిక సబ్ రిజిస్టర్ ఆఫీస్ వెనుక ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివా ళులర్పించారు. **ప్రజాశక్తి- సత్తెనపల్లి టౌన్ :** స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ పెండెం బాబురావు మాట్లాడారు. అమరావతి బస్టాండ్ వద్ద నున్న బాబు జగ్జీవన్ రావ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు .**ప్రజాశక్తి- వినుకొండ:** ఆరోగ్య మిత్ర దళిత గిరిజన ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూల మాలలు వేసి నివాళులర్పించారు. **ప్రజాశక్తి- గుంటూరు:** జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెర హెనీ క్రిస్టినా పూలమాలలు వేసి నివాళులర్పించారు. **ప్రజాశక్తి- తాడేపల్లి:** క్రిష్టియన్‌పేటలోని వైసిపి కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు, పెను మాకలో బాబూజగ్జీవన్ రామ్ విగ్రహానికి మంగళగిరి నియోజకవర్గ ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులు బి.జాన్‌ప్రకాష్ పూలమాల వేసి నివాళులర్పించారు. **ప్రజాశక్తి - పొన్నూరు:** స్థానిక రేపల్లె బస్టాండ్ సెంటర్లో లోని జగజీవన్ రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. **ప్రజాశక్తి-దుగ్గిరాల:** స్థానిక టిడిపి కార్యాలయంలో, పోస్ట్ ఆఫీస్ వద్ద ఉన్న బాబు జగ్జీవన్ రామ్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు . **ప్రజాశక్తి-మంగళగిరి:** స్థానిక కొత్త బస్టాండ్ సెంటరోని జగ్జీవన్ రామ్ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. **ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్:** కుంచన పల్లిలోని తాడేపల్లి మండల టీడీపీ కార్యాలయంలో కూటమినేతలు నివాళులర్పిం చారు. **ప్రజాశక్తి-ఎన్‌యు:** తాత్కాలిక రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సంధ్యకోలే, బాబు జగ్జీవన్ రామ్ ఛైర్ కోఆర్డినేటర్ ప్రొఫె సర్ కె. మధుబాబు నివాళులర్పించి మాట్లాడారు. **ప్రజాశక్తి-మంగళగిరి రూరల్:** నిడమర్రు రావిశెట్టి సెంటర్లో నివాళులు అర్పించారు.

16న ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా మహాసభ

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

16వ తేదీన ఉదయం 10 గంటలకు గుంటూరులోని సిఐటియు కార్యాలయంలో జరిగే ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి ధనలక్ష్మి కోరారు. శనివారం పెదనందిపాడు లోని తేళ్ల నారాయణ విజ్ఞాన్ కేంద్రంలో జరిగిన ఆశా వర్కర్ల మండల సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం వేతనాల పెంపుదల హామీ ఇచ్చి అమలు జరపలేదని, ఆశా వర్కర్లకు ప్రభుత్వ పథకాలు కూడా రద్దు చేశారని చెప్పారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం వేతనాల పెంపుదల తో పాటు, ప్రభుత్వ పథకాలను కూడా పునరుద్ధరించాలని కోరారు. రిటైర్మెంట్ వయసును 62 ఏళ్లకు పెంచాలని, మెటర్నటీ లీవ్ ఇవ్వాలని, ఆశ వర్కర్ల చేత వారి పనులు కాక అదనపు పనులు చేయించే రాదని, విధుల్లో ఉండి చనిపోయిన ఆశా వర్కర్లకు నష్టపరిహారంతో పాటు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఆశ వర్కర్ల మీద పని ఒత్తిడి తగ్గించాలని తదితర డిమాండ్ల సాధన కోసం ఈనెల 16వ తేదీన జిల్లా మహాసభను జరుపుకోవడం జరుగుతుందని, ప్రతి ఒక్క ఆశా కార్యకర్త ఈ కార్యక్రమంలో పాల్గొని డిమాండ్ల సాధన కోసం జరిగే సభను జయప్రదం



చేయాలని కోరారు. సమావేశాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు, సరిత, సరళ దేవి, ఎస్తేరు రాణి మండలం లోని ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



డిజిపికి అభినందనలు తెలిపిన కేశన

ప్రజాశక్తి మంగళగిరి

డిజిపి ద్వారకా తిరుమలరావుని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు మర్యాదపూర్వకంగా శనివారం కలిసి అభినందించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో బీసీ కులాల వారిపై జరిగిన దౌర్జన్యాలు, హత్యలు, మానభంగాలు తిరిగి పునరావతం కాకుండా శాంతి భద్రతలు కాపాడాలని కోరారు. నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణకు మారుపేరైన తిరుమలరావును డిజిపిగా నియమించినందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. గత ఐదు సంవత్సరాలుగా కుల,మత,వర్గ భేదాలు లేకుండా, అసాంఘిక శక్తులు అరాచక పరిస్థితులు కల్పించారని, ఇలాంటి వారిపై ఉక్కు పాదముతో అణిచి వేయాలని, శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తున్న వారిని చట్టపరంగా శిక్షించాలని, చట్టం ఎవరి చుట్టం కాదని వారి సర్వీసులో రాజకీయ జోక్యం కలిగించరాదని కోరారు.

ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-తాడేపల్లి

ఎస్సి, ఎస్టి ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని రాష్ట్ర ఎస్సి, ఎస్టి గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.వి.రమణ కోరారు. శనివారం ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం తాడేపల్లిలోని సిఎస్ఆర్ కల్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటైన టిడిపి ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలు తీసుకెళ్తామని చెప్పారు. మొన్న జరిగిన ఎన్నికల్లో దాదాపు 80 శాతం ఉద్యోగులు కూటమికి మద్దతు తెలిపారన్నారు. ఆగస్టు పదో తేదీన జరిగే రాష్ట్రస్థాయి సర్వసభ్య సమావేశంలో ఎన్నికలు నిర్వహించిన నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో వీరన్న, సిహెచ్.ఆనంద్, సుధాకర్‌బాబు, డాక్టర్ ఒ.నాగరాజు, ఎం.రాఘవులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో రహదారుల సర్వే రిపోర్టు

ప్రజాశక్తి దుగ్గిరాల

మంగళగిరి నియోజకవర్గంలోని రోడ్ల నెట్వర్క్‌ను ఆన్ లైన్ చేసి సాఫ్ట్వేర్‌లో పొందుపరిచేందుకు మండలంలోని 17 పంచాయతీల ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ రూరల్ రోడ్స్ డెవలప్మెంట్ ప్రాజెక్టు అడ్వైజర్ వై నరసింహారావు వీరికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లను సర్వే చేసి ఇంటర్నెట్లో పొందుప రుస్తారని యాప్ ఓపెన్ చేసినట్లయితే రోడ్లకు సంబంధించిన అన్ని వివరాలు తెలుస్తాయన్నారు. రోడ్ల విస్తీర్ణం కల్వర్టులు డ్యామేజ్, అయిన కల్వర్టులు దూరం రోడ్ల డ్యామేజీ అన్ని వివరాలు కొత్త సాఫ్ట్వేర్ రోడ్ మ్యాప్ లో పొందుపరుస్తారని తెలిపారు. కార్యక్రమంలో డి ఈ జె సాంబ శివ రావు డి ఈ ఎం జి ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

11 నుండి వ్యాపార రంగంలో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి పట్టణంలో రిత్వీక శ్రీ ఎడ్యుకేషనల్ సొసైటీ వారి ఆధ్వర్యంలో స్థానిక వీటిజేయం అండ్ ఐ వి టి ఆర్ డిగ్రీ కళాశాలో సహకారంతో 15 రోజులపాటు వ్యాపార అభివృద్ధి కార్యక్రమమునకై ఉచిత శిక్షణా కార్యక్రమము 11వ తేదీ నుంచి ఏర్పాటు చేయడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ జి నాగేశ్వరావు శనివారం తెలిపారు. ప్రస్తుతం వ్యాపారం చేస్తున్న చిరు వ్యాపారులు అలాగే నూతనముగా వ్యాపారాన్ని ప్రారంభించాలనుకునే వారి కోసం సరైన మెలకువలు ఈ 15 రోజులపాటు శిక్షణ కార్యక్రమంలో తెలియజేయడం జరుగుతుందని చెప్పారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం చే ఉచితముగా సర్టిఫికెట్ అందించడం జరుగుతుంని తెలిపారు. శిక్షణ పొందుటకు 18 - 50 సంవత్సరాల లోపు వయసు వారు అర్హులని, కేవలం 60 మందికి మాత్రమే అవకాశం ముందన్నారు. వివరాలకు ఫోన్ నెంబర్ 9705618919 సంప్రదిం చాలని కోరారు. దరఖాస్తుదారులు తప్పనిసరిగా పదవ తరగతి ఇంటర్మీడియట్ ర్యాంకు కార్డుల జిరాక్స్ కాపీలు రెండు పాస్ పోర్టు ఫోటోలు జతపరిచి. తమ దరఖాస్తులను ఇర్మియా సూపర్ బజార్ గుంటూరు రోడ్డు పెదనందిపాడు వద్ద అంద చేయవలసిందిగా సాయి ప్రసాద్ కోరారు.

మారీసుపేట-పినపాడు రైల్వే ఓవర్ బ్రిడ్జి కావాలి

ప్రజాశక్తి-తెనాలి : పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా పినపాడు-మారీసుపేట రైల్వే గేట్ల వద్ద ఫ్లైఓవర్ అనివార్యమని పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం అధ్యక్షులు దర్శి శివ కోటేశ్వరరావు అన్నారు. శనివారం రైలు గేట్ల ప్రాంతాన్ని సంఘ సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు-రేపల్లె, చెన్నై- విజయవాడ ప్రధాన రైలు మార్గాలు కావడంతో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఉద్యోగులు, పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, వివిధ వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. నాదెండ్ల మనోహర్ మంత్రిగా ఉన్న నేపథ్యం ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కేంద్ర మంత్రిగా ఉన్న నేపథ్యంలో ఇరువురు ఫ్లైఓవర్ నిర్మాణానికి చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు ఆర్ఎస్ శంకరరావు, కె.బాబు ప్రసాద్, అబ్దుల్ ఆరిఫ్, అబ్రహం లింకన్, వి సతీష్, రాజేష్, వి పేరి రెడ్డి, వి సతీష్, రమేష్ పాల్గొన్నారు

అతిసార రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పొన్నూరు

అతిసార వ్యాధి రాకుండా అవగాహనతో ముందు జాగ్ర త్తగా చర్యలు తీసుకోవాలని పొన్నూరు ఎంపీ హెచ్ ఈ ఓ పూర్ణచంద్రరావు అన్నారు. శనివారం పొన్నూరు మండలంలోని కసుకర్రు, సీతారామపురం, ఉప్పరపాలెం, పెదపాలెం, నండూరు, మాచవరం, ములుకుదురు, కొండముది గ్రామాలలోని సచివాలయాల పరిధిలో అంగన్వాడి కేంద్రంలోని విద్యార్థుల తల్లిదండ్రులకు అతిసార వ్యాధి రాకుండా జాగ్రత్తల గురించి ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. 0 నుండి 5 సంవత్సరాల పిల్లల తల్లిదండ్రులకు అతి సార వ్యాధి నివారణకు ఓఆర్ఎస్, జింకు టాబ్లెట్లు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఆహారం తీసుకునే ముందు, వాష్ రూమ్‌కు వెళ్లి వచ్చిన తర్వాత ప్రతిసారి సబ్బుతో చేతులు శుభ్రపరుచుకోవాలని తెలిపారు. వర్షాకాలంలో వేడివేడి ఆహార పదార్థాలు భుజించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని పేర్కొన్నారు. జూలై 1వ తేదీ నుండి ఆగస్టు 31వ తేదీ వరకు అతిసార వ్యాధి నివారణ కార్యక్రమాలు నిర్వహి స్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వారానికి ఒకసారి ఫ్రైడే ను డ్రై డే గా చేసుకోవాలని తెలిపారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన అవగాహన కల్పించారు. రాత్రిపూట దోమతెరల్లో నిద్రించాలని తెలిపారు. వాటర్ ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి క్లోరినేషన్ చేసుకొని ప్రతిసారి వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉప్పరపాలెం, మాచవరం, కసుకర్రు గ్రామాల ఏఎన్ఎంలు రాజేశ్వరి, అనూష, మణెమ్మ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కెఎల్‌యులో 'తల్లి పేరుతో మొక్క నాటండి'

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్



మొక్కను నాటుతున్న కె.రాజశేఖర రావు

ప్రతీ విద్యార్థి తన తల్లి పేరుతో కనీసం ఒక మొక్కనైనా నాటి దాని సంరక్షణ బాధ్యతలను తీసుకోవాలని కెఎల్ యూనివర్సిటీ వైస్ చాన్సులర్, ప్రొఫెసర్, డాక్టర్ కె.రాజశేఖర రావు అన్నారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ పిలుపుమేరకు వర్సిటీ ప్రాంగణంలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో తల్లి పేరున ఒక మొక్క నాటండి అనే కార్యక్రమాన్ని శనివారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ ప్రతినిధులు వివిధ రకాల మొక్కలు నాటారు. అనంతరం విసి డాక్టర్ కె.రాజశేఖరరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని, చెట్లు లేని ప్రపంచాన్ని ఊహించుకోవడం చాలా కష్టమన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి భాధ్యత అని గుర్తు చేశారు. చెట్లు లేని కారణంగా పలు దేశాలు ఇప్పటికే పకృతి వైపరీత్యాల వలన తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని గుర్తు చేశారు. రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు మాట్లాడుతూ పచ్చదనం ప్రకృతిని ఎల్లవేళలా కాపాడుతుందని అన్నారు. చెట్లు లేకపోవడం వలన కాలుష్యం పెరిగిపోయి సకాలంలో వర్షాలు కురవడం లేదని తద్వారా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాలు సకాలంలో కురవక పోవడం వలన మంచు పర్వతాలు సైతం కరిగిపోయి సముద్ర మట్టాలు పెరిగిపోయి ప్రకతి వినాశనానికి మనిషే ప్రధానంగా కారణమవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రతీ ఒక్కరూ భాద్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. విద్యార్థి సంక్షేమ విభాగ ఇంచార్జి డీన్ డాక్టర్ కెఆర్ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ తల్లిపై ఎంత ప్రేమ చూపుతామో అలాగే మొక్కల పెంపకంపై కూడా అదే ప్రేమను చూపించాల్సిన సమయం వచ్చిందన్నారు. ఈ సందర్భంగా వర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు అందరూ తమ దత్తత గ్రామాలలో విద్యార్థుల చేత మొక్కలు నాటించాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పి శ్రీకాంత్ రెడ్డి సూచించారు. కార్యక్రమానికి పి అండ్ డి విభాగం వారు సహకారం అందించగా కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారధివర్మ, ప్రొఫెసర్ డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్ రామ్, విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లాఖాన్ మొక్కలు నాటారు.

డెంగీపై అవగాహన

ప్రజాశక్తి మంగళగిరి

డెంగీ మాసోత్సాల్లో భాగంగా శనివారం మంగళగిరి పట్టణంలోని జి ఆర్ స్కూల్లో డెంగీపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయన పాల్గొని మాట్లాడుతూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యంగా ఉండాలని కోరారు. విద్యార్థులు ఈ సీజన్లో వచ్చే వ్యాధులకు గురికాకుండా ఉండాలంటే శుభ్రత పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎమ్ఓ రాజు నాయక్, సూపర్వైజర్ యన్ సాగర్ బాబు, మూర్తి, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ఎంకెఆర్ ఫౌండేషన్ అధినేత ముప్పవరపు కృష్ణారావు

ఎంకెఆర్ ఫౌండేషన్ వితరణ

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి పరిధిలోని మందడం జెడ్పి హైస్కూల్లో శనివారం విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. ఎంకెఆర్ ఫౌండేషన్ పేరుతో ముప్పవరపు కృష్ణారావు రూ.20 వేలు కేటాయించి 50 మంది విద్యార్థినీ,విద్యార్థులకు యూని ఫాం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ ఉన్నత విద్య నభ్యసించే పేద విద్యార్థులకు ఎంకెఆర్ ఫౌండేషన్ పేరుతో ఎన్నో ఏళ్లుగా అనేక సహాయ సహకారాలు అందిస్తున్నామని చెప్పారు. ఈ క్రమంలో మందడం గ్రామంలో ఇంటర్ చదువుతున్న విద్యార్థులతో పాటు జిల్లా పరిషత్ హైస్కూల్ లోని విద్యార్థులకు యూనిఫాంను అందించడం జరిగిందన్నారు. ప్రభుత్వం అందించే సహాయ సహకారాలతో పాటు ఉద్యోగస్తులు, దాతలు ముందుకు వచ్చి ప్రభుత్వ పాఠశాలలో,కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు చేతనైనంత సహాయం అందించి పేద విద్యార్థుల విద్యకు,ఉన్నతమైన జీవితానికి తోడ్పాటు అందించాలని ఆయన పిలుపు నిచ్చారు.



బుర్రిపాలెం రోడ్డులో ఆక్రమణల తొలగింపు

సైడ్ డ్రెయిన్లపై ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి తెనాలి

పట్టణ ప్రణాళికా విభాగం ఆధ్వర్యంలో సైడ్ డ్రెయిన్ల పై ఉన్న ఆక్రమణల తొలగింపును అధికారులు వేగవంతం చేశారు. ప్రధానంగా వర్షాకాలంలో పారుదలలేని సైడ్ డ్రెయిన్లు పొంగి రోడ్ల జలమయం అవుతున్న పరిస్థితులను చూస్తూనే ఉన్నాం. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పట్టణంలో మురుగు నీటి పారుదల సరళీకతం చేసేందుకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో అధికారులు శ్రీకారం చుట్టారు. పాటి కాలవ, పాలయాద్రి కాల్వ, జంపని డ్రైన్ ప్రధానంగా మురుగునీటిని తరలించే కాలువలు. ఈ కాలువలపై వ్యాపారులు ఆక్రమణలతో కాలువలు శుభ్రం చేసేందుకు వీలుకాని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో కాలువల్లో వ్యర్థాలు మేట వేసి నీటిపారుదల నిలిచిపోవడం, ఫలితంగా వర్షాలు పడినప్పుడు పొంగి రోడ్లు జలమయమౌతున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి మనోహర్ ఇటీవల పురపాలక సంఘం అధికారులతో సమీక్ష జరిపి, మురుగునీటి పారుదల వ్యవస్థ మెరుగుపరచాలని ఆదేశించారు. దీంతో మురుగు కాలువల పై ఉన్న ఆక్రమణలు తొలగించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. దీనిలో భాగంగానే బుర్రిపాలెం రోడ్డులో జెసిబి సాయంతో కాలువలపై ఉన్న ఆక్రమణలు తొలగింపుకు శనివారం పూనుకున్నారు. స్థానికుల నుంచి కొంత వ్యతిరేకత వ్యక్తం అవుతున్నప్పటికీ నిబంధనల మేరకు పనులు కొనసాగుతున్నాయి పనులను పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

ఆర్‌విఆర్ విద్యార్థిని విజయలక్ష్మీకి రూ.25లక్షల ప్యాకేజితో ఉద్యోగం



ప్రజాశక్తి-గుంటూరు

బెంగళూరుకు చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ వేఫైర్ గ్లోబల్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ తమ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో సిఎస్ఈ విభాగంలో చివరి సంవత్సరం చదువుతున్న అరికట్ల విజయలక్ష్మి రూ.25 లక్షల రూపాయల ప్యాకేజీతో 'అసోసియేట్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం సాధించడం గర్వకారణమని కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు.ఉద్యోగం సాధించిన విద్యార్థినిని కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, కళాశాల సిబ్బంది అభినందించారు. తమ కళాశాలలోని అనుభవజ్ఞులైన అధ్యాపక బందం విద్యార్థులను చదువుల్లో, ఉద్యోగ కల్పనలో ఉన్నతంగా తీర్చిదిద్దున్నట్లు రాయపాటి గోపాలకష్ణ, కళాశాల ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సి.హెచ్.శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.



వివిధ కంపెనీల ప్రతినిధులతో వీసీ

విజ్ఞాన్స్‌లో ఘనంగా భారత్ పిచథాన్ 3.0

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'భారత్ పిచథాన్ 3.0' కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. 'అన్‌ఎర్తింగ్ స్టార్టప్స్ ఫ్రమ్ భారత్' అనే ఇతివత్తంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆవిష్కరణలు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లు పెంపొందించే లక్ష్యంతో జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ స్టార్టప్‌ల నుండి ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమానికి విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ ముఖ్య అతిథిగా హాజరై పారిశ్రామికవేత్తలతో సంభాషించారు. వారిని ప్రోత్సహిస్తూ, పారిశ్రామికవేత్తలకు విజ్ఞాన్ అందిస్తున్న సహకారం గురించి మాట్లాడారు. అనంతరం హైదరాబాద్‌లోని నాంది వెంచర్స్‌తో ఎంవోయూపై సంతకం చేశారు. ఎంవోయూ పత్రాలను నాంది వెంచర్స్ కోఫౌండర్ వికాస్ కాట్రగడ్డకు అందజేశారు.హెడ్‌స్టార్ట్ నిర్వహించిన ఈభారత్ పిచాథాన్ ద్వారా పారిశ్రామికవేత్తలను వారి వెంచర్‌లను కొనసాగించడానికి, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వద్ధికి దోహదపడిందన్నారు. స్టార్టప్‌లు అభివద్ధి చెందడానికి, పరిశ్రమ నిపుణులు, పెట్టుబడిదారులతో కనెక్ట్ అవ్వడానికి ప్లాట్‌ఫారమ్‌లను అందించడం ఈ ఈవెంట్ ప్రధాన ఉద్దేశమని తెలియజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజోర్‌పే కమ్యూనిటీ ప్లాట్‌ఫామ్స్ లీడ్ ఈషిత మహేశ్వరి మాట్లాడుతూ సరికొత్త ఆవిష్కరణలతో ముందుకు వచ్చే వారికి కావాల్సిన ఆర్థిక తోడ్పాటును కూడా అందిస్తామన్నారు. ఎవరికైనా కొత్త ఐడియాలు ఉంటే వాటిని వెంటనే అభివద్ధి చేసి మార్కెట్‌లోకి విడుదల చేయాలన్నారు. హెడ్‌స్టార్ట్ ఫౌండేషన్ ఏపీలీడ్, అవసర్లాల కోఫౌండర్ అశ్వతి వేణుగోపాల్, జెల్పమాక్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ జరన్ భగ్వాగర్, ఏజీఆర్ కార్పొరేట్ కన్సల్టెంట్స్ సీఈవో వరుణ్ ఏజీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





వినుకొండ, గుంటూరులో అధికారుల తనిఖీ

మిర్చి విత్తనాలు,పురుగుమందులు సీజ్

గుంటూరులో రూ.5.80 లక్షల మిర్చి విత్తనాలు సీజ్ - పల్నాడు జిల్లా వినుకొండలో రూ.7లక్షల 30 వేల పురుగుమందులు సీజ్

ప్రజాశక్తి-గుంటూరు

వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారులతో కూడిన రాష్ట్ర స్థాయి బృందం తనిఖీలు రెండో రోజూ కొనసాగుతున్నాయి. శనివారం గుంటూరు రూరల్ మండలం, పెదపలకలూరులోని శ్రీ సత్య అగ్రి బయోటెక్ ప్రైవేటు లిమిటెడ్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్, ప్రాసెసింగ్ యూనిట్‌ను తనిఖీ చేశారు. స్టాకు బోర్డులో, స్టాక్ రిజిస్టర్ల నిల్వల ప్రకారం భౌతికంగా ఉన్న విత్తనాల ప్యాకెట్లను పరిశీలించారు. స్టాకు బోర్డు ప్రకారం ఉన్న మిర్చి పంటకు సంబంధించిన విత్తనాలు రకం ఎస్‌సిపిహెచ్-279 అనే హైబ్రిడ్ రకానికి చెందిన 306 ప్యాకెట్లు వ్యత్యాసం ఉన్నందున సీడ్ యాక్ట్ 1966 చట్టం ప్రకారం భౌతికంగా ఉన్న రూ.5,80500ల విలువైన 645 ప్యాకెట్లను సీజ్ చేసి, 6ఎ కేసు నమోదు చేశారు. ఈ తనిఖీలలో ఎడిఎ డి.బాలాజీ నాయక్, గుంటూరు సహాయ వ్యవసాయ సంచాలకులు యం.సునీల్, విజిలెన్స్ సిఐ యం.శ్రీనివాసులురెడ్డి, గుంటూరు అర్బన్-1 వ్యవసాయాధికారి ఓ.సునీల్, గుంటూరు రూరల్ మండల వ్యవసాయాధికారి వి.సుబ్రహ్మణ్యం ు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- వినుకొండ

రైతులకు నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అధికారి సి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం పట్టణంలోని విత్తనాలు, పురుగుమందుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం విజిలెన్స్ వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా తనిఖీలు చేపట్టామన్నారు. ఈ తనిఖీల్లో కారంపూడి రోడ్డులోని జై కిసాన్ ఆగ్రో టెక్నాలజీ నిర్వాహకులు జయరావు ఎటువంటి అనుమతులు లేకుండా పురుగు మందుల విక్రయాలు జరుపుతున్నారనే విషయం తనిఖీల్లో తెలిసిందన్నారు. 455 లీటర్ల పురుగు మందులను సీజ్ చేయటం జరిగిందని, వాటి విలువ సుమారు రూ.7లక్షల 30 వేలు ఉంటుందన్నారు. అలాగే జింక్, బోరన్, ఎరువుల తయారీకి ఉపయోగించే ముడిసరులకు సంబంధించిన అనుమతులు ఉండి కూడా స్టాక్‌ను రిజిస్టర్‌లో నమోదు చేయకుండా వ్యాపారం నిర్వహిస్తున్నారని రూ.2 లక్షల 50 వేల విలువగల 5,500 కేజీల ముడి సరుకును గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం శివయ్య స్థూపం సెంటర్లోని విత్తనాల షాపుల్లో రికార్డులను తనిఖీ చేశారు. దుకాణ నిర్వాహకులు విత్తనాలు కానీ పురుగు మందులు కానీ రైతులకు బిల్లులు ఇవ్వకుండా అమ్మకాలు జరిపితే కేసులు నమోదు చేసి లైసెన్సులు కూడా రద్దు చేయటం జరిగిందని హెచ్చరించారు. ప్రతి రైతు విత్తనాలు పురుగు మందులు కొనుగోలు చేసిన తర్వాత దుకాణదారుడు నుండి ఖరీదు చేసిన వాటికి బిల్లులు తీసుకోవాలని సూచించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్ఐ ఎం.రామచంద్రయ్య, డి డి ఏ వరలక్ష్మీ, వినుకొండ ఏవో కే. అంజిరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

వర్శిటీ ప్రొఫెసర్‌కు అవార్డు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్మెంట్ విభాగాధిపతి డీన్ ఆచార్య రామినేని శివరామ్ ప్రసాద్‌కు ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. హైదరాబాద్ నల్సార్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన శనివారం అటార్నీ జనరల్ ఆఫ్ ఇండియా రమణి నుండి క్యాపిటల్ ఫౌండేషన్ అవార్డు స్వీకరించారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం



ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి
(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

టిడిపి నేతల దూకుడు



వీక్షణం

అధికారంలోకి వచ్చి నెల రోజులు కూడా పూర్తికాక ముందే టిడిపి నేతలు దూకుడు వైఖరి ప్రదర్శిస్తున్నారు. గ్రామాల్లో పట్టు సాధించేందుకు అన్ని వ్యవస్థలను తమ అధీనంలోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎన్నికలకు ముందు గత ప్రభుత్వ హయంలో తమకు నచ్చని వ్యక్తులపై అధికారంలోకి రాగానే దాడులకు తెగబడుతున్నారు. ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్న చిరుద్యోగులపై తమ ఆధిపత్యం కొనసాగించేందుకు ప్రయత్నిస్తున్నారు. జిల్లాకు చెందిన మంత్రులు నారా లోకేష్, నాదెండ్ల మనోహర్ తమ శాఖలలో సమర్ధవంతంగా పనిచేస్తూ నిత్యం ప్రజలను కలుస్తూ వారి సమస్యలు వింటూ వాటి పరిష్కారం కోసం కృషి చేస్తుండగా క్షేత్రస్థాయి నాయకులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. నారా లోకేష్ గత పక్షం రోజులు నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌కు ప్రశంసలు వస్తున్నాయి. ఆయన వద్దకు వచ్చిన వారి సమస్యలు తక్షణం పరిష్కారం కాకపోయినా ఆయన ప్రజలకు చేరువ అయ్యేందుకు చేస్తున్న ప్రయత్నాలు మంచి పేరును తెచ్చిపెట్టాయి.ఈ ప్రక్రియ ఎమ్మెల్యేలంతా ఆయా నియోజకవర్గాల్లో కొనసాగిస్తే ప్రజలకు ఎంతో కొంత మేలు జరుగుతుందనే భావన టిడిపి కార్యకర్తలు, సాధారణ ప్రజలకు ఆశిస్తున్నారు. ఇదే సమయంలో టిడిపి నాయకులు వ్యక్తిగత కక్షలు, గతంలో గ్రామాల్లో ప్రదర్శించిన ఆధిపత్య ధోరణిని తిరిగి పునరావృత్తం చేయడం ద్వారా ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువస్తున్నారన్న భావన సీనియర్ నేతల్లో లేకపోలేదు. మంత్రి అనగాని సత్య ప్రసాద్ ప్రాతినిధ్యం వహిస్తున్న చెరుకుపల్లి మండలంలో టిడిపి కార్యకర్తలు ప్రత్యర్థులపై దాడులకు పాల్పడటం తీవ్ర విమర్శలకు దారితీసింది. రాంబొంట్లపాలెంలో ఎస్‌టి యువకుడి కుటుంబాన్ని టిడిపి కార్యకర్తలు దాడిచేసి తీవ్రంగా గాయపర్చారు. చెరుకుపల్లిలో ఏకంగా ఒక విలేకరి ఇల్లు కూల్చివేయడం జిల్లాలో కలకలం రేపింది. ఉమ్మడి జిల్లాలోని ఆయా గ్రామాల్లో చౌకడిపో డీలర్లను బలవంతంగా మార్చడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, మధ్యాహ్నభోజన కార్మికులను మార్చి తమ అనుచరులకు ఇప్పించుకోవాలని మండల నాయకులు ఎమ్మెల్యేలపై వత్తిడి తెస్తున్నారు. తద్వారా ప్రస్తుతం ఆయా విభాగాల్లో సేవలందిస్తున్న వారు వీధినపడితే వారికి తక్షణం ఉపాధి ఎలా లభిస్తుందనేదీ ప్రశ్నార్థకంగా మారింది. మరో వైపు గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల ద్వారా ఒకటో తేదీనే 95 శాతం మందికి సామాజిక పింఛన్లను పంపిణీ చేసి టిడిపి ప్రభుత్వం కొత్త రికార్డును నెలకొల్పింది. ఇదే సమయంలో అక్కడక్కడ టిడిపి నాయకులు గతంలో మాదిరిగా తమ ఆధిపత్యం ప్రదర్శించేందుకు ప్రయత్నించారు. రొంపిచర్ల మండలం పగటి చర్ల గ్రామంలో పగటిచర్లలో టిడిపి నాయకులు చిగురుపాటి ఆదినారాయణ తన ఇంటివద్దకు లబ్ధిదారులు రావాలని గ్రామంలో చాటింపు వేయించి లబ్ధిదారులను తన ఇంటి చుట్టూ తిప్పుకోవడం తీవ్ర విమర్శలకు దారితీసింది. లబ్ధిదారుల్లో కొంత మంది పింఛన్లు ఇవ్వకపోవడంతో పాటు దుర్భాషలాడారన్న ఆరోపణలు వచ్చాయి. దీంతో సంబంధిత లబ్ధిదారులు కొందరు తమకు న్యాయం చేయాలని అదే గ్రామానికి చెందిన సిపిఎం నాయకులు కామినేని రామారావు ఆశ్రయించగా ఆయన కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. అధికారుల వత్తిడితో పింఛన్లను పంపిణీ చేశారు. అధికారులకు ఫిర్యాదు చేశారన్న కక్షతో సిపిఎం నాయకులు కామినేని రామారావుపై టిడిపి నాయకులు దాడి చేసి కొట్టారు. ఇంటిపై దొమ్మికి పాల్పడ్డారు. వైసిపి హయంలో ఇదే తరహా దాడులు జరిగాయని విమర్శలు చేసిన టిడిపి నాయకులు కూడా వారి తరహాలోనే దాడులకు పాల్పడటం వల్ల ఆదిలోనే ప్రజలలో వ్యతిరేకతను మూటగట్టుకోకతప్పదు.

(ఎ.వి.డి.శర్మ)